







శ్రీ అచలానంద ఆశ్రమములో దశరా మహోత్సవములలో వివిధ కార్యక్రమములు

# కాలజ్ఞానసుధ

ఆధ్యాత్మిక మాస పత్రిక

డిసెంబరు - 2015 సంపుటి:19 సంచిక:12




**ఈ నెల సూక్తి**

➢ దృశ్యపదార్థము లందెంత ఆసక్తి తగ్గుచుండునో దేవుని యందు అంత భక్తి వృద్ధియగు చుండును.



## విషయ సూచిక


| | |
|---|---|
| సంపాదకీయం - సవ్యంగా ఆలోచించండి | 4 |
| సనాతన ధర్మము - దాని విశిష్టత (బ్రహ్మచర్యం) | 5 |
| వేదపరిచయము | 7 |
| గుండాల మల్లిఖార్జునస్వామి | 9 |
| ఆత్మజ్ఞానంతో ఎప్పడూ ఆనందమే | 11 |
| ఆది గురువు ఆచార్య శంకరులు | 14 |
| యోగవాసిష్ట కథాలహరి - జ్ఞానాదేవతు కైవల్యం | 17 |
| మంచితనం | 18 |
| భగవద్గీతకు భాసురభాష్యం | 19 |
| మహాభారతంలోని నీతి కథలు | 22 |
| రఘువంశం | 23 |
| మహాదాత కర్ణుడు | 26 |
| కాశీక్షేత్రం | 27 |
| దర్శనీయ దేవాలయాలు - గుమ్మిలేరు | 29 |
| శ్రీరామ భక్తి ( వేదవ్యాసుని శ్రీరామభక్తి) | 30 |
| వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు | 33 |
| గోవిందమాల వ్రత విధానం | 34 |
| వాస్తు - సైన్సు | 37 |


ముఖచిత్రం : శ్రీ దత్తాత్రేయ

**చందా వివరములు**

జీవిత చందా (20సం॥) : 1116/-

సంవత్సర చందా : 100/-


చందాలు పంప వలసిన చిరునామా:

**కాలజ్ఞాన సుధ**

శ్రీ అచలానంద ఆశ్రమము, 8-202(1), మంగమూరు రోడ్డు,
ఒంగోలు-523002 ప్రకాశం జిల్లా (ఆం.ప్ర)
ఫోన్స్ 08592/235341, 9949132469, 9705555229, 8977799289

సంపాదకులు: శ్రీ పరిపూర్ణ సిద్ధానందస్వాములవారు

సంపాదకీయం

# సవ్యంగా ఆలోచించండి

7. కన్నులున్న ఫలము కాళికం జూచుట
చెవులుగల ఫలమ్ము చేరివినుట
నోరుగల ఫలమ్ము నుతిచేసి తనియుట
కాళికాంబ! హంస! కాళికాంబ!

శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారు ప్రవచించిన పద్యమిది. మానవజన్మ భగవద్దత్తము. ఈ రమ్యరమణీయ ప్రకృతిలో ఆనందంగా జీవితాన్ని గడపమని మనలను పంపించాడు పరమాత్మ. కాని మంచి జన్మ మంచి తల్లిదండ్రులు, మంచి కుటుంబం ఆస్తులు ఐశ్వర్యాలు అన్ని ఇచ్చాడా పరమాత్మ, ఎవరి స్థాయిలలో వారు బ్రతకడానికి కావలసినవి ఇచ్చాడు. కాని తానేమి చేస్తున్నాడు. అవలక్షణాలతో అసంబద్ధ కార్యక్రమాలకు పాల్పడుతున్నాడు.

సమాజంలో కొన్ని కట్టుబాట్లు వున్నవి. వాటిని ఆచరించటంద్వారా అందరూ హాయిగా జీవనయానాన్ని సాగించవచ్చు. ఎవరైనా ఆ నియములను అతిక్రమించినట్లైతే వారికి నష్టం కలగటమే కాకుండా సమాజానికి కూడా నష్టం వాటిల్లుతుంది.

భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు మానవాళికి వరాలు. వాటిని ఆచరించినవారు ఆనందంగా వుండటమేకాకుండా వారి వలన సమాజానికి హాని జరుగని మహత్తర వుపకారం జరుగుతుంది.

భారతదేశంలో నిర్భయచట్టం రావలసిన దౌర్భాగ్యపు స్థితి వచ్చిందంటే దానికి కారకులెవరు ? వారు పరదేశీయులుకాదు. స్వదేశీయులే. కాకపోతే పరదేశీయ సంస్కారాలను అలవర్చుకుంటున్నారు. మనం చూసే ప్రతి దృశ్యం లోనూ మంచీ చెడు వుంటుంది. ద్రౌపతి వస్త్రాపహరణం జరుగుతుంటే అది చూచి ఆనందించిన దుష్టచతుష్టయ సమూహమున్నది. దానిని చూడలేక కనులు మూసుకుని సిగ్గుపడిన పెద్దలూ వున్నారు. చూచి ఆనందించినవారు తరువాత దిక్కులేని చావుచచ్చారు. దానిని సహించని వారు, పరమాత్మ ముద్దుబిడ్డలయ్యారు. భావితరాలవారికి ఆదర్శప్రాయులయ్యారు.

నేత్రాలనిచ్చింది మంచి దృశ్యాలను చూడమని చూచిన ప్రతి దృశ్యంలోను మంచినే గ్రహించమని, ఆ కాళీమాతను చూచిన నేత్రాలు స్త్రీలనందరిని కాళీమాత అంశసంబూతులుగానే చూడమని చెపుతున్నది. మంచి మాటలు, ఆధ్యాత్మిక విషయాలు భగవన్నామాలన్నుతాన్ని ద్రోలమనీ కోరుకున్నది. మంచి మాటలను మాట్లాడమనీ మంచినే పలకమనీ భగవన్నామస్మరణతో తరించమనీ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి సందేశం.

స్త్రీని చూస్తే చాలు పిచ్చికుక్కలా చరించే వున్మాదులు, నేటి సమాజంలో వున్నారు. అలాంటి దుష్టభావాలున్నవారు మానవరూపంలోవున్న రాక్షసులే సుమా! రాక్షసులకు నీతులు చెప్పమన్నారు వినకపోతె దండించమన్నారు. అదీకాకపోతే వధించమన్నారు. ఏకపత్నీవ్రతుడు, పితృవాక్య పరిపాలకుడు ప్రజారంజకుడైన పాలకాదక్షుడు అయిన రాముడు కూడా రావణాది అసురులకు నీతి వాక్యాలు చెప్పి వినకపోతే హతమార్చాడు.

తాత్కాలికమైన ఆవేశంతోనో, కామాక్రోదంతనో, అసాంఘిక కార్యకలాపములకు పాల్పడితే ఆ క్షణం తరువాత వారి పరిస్థితేమిటి ? ఏడు చువ్వలు లెక్కపెట్టుకోవాలి. చిప్పకూడు తినాలి. దుర్భర జీవితాన్ననుభవించాలి. ఇది అవసరమా ?

నిగ్రహమ్ము లేని నిర్భాగ్యులు వెతలపాలు కాక తప్పదని స్వామి చెప్పారు. సవ్యంగా ఆలోచించండి సన్మార్గంలోచరించండి. ఆదర్శనీయులు, మహానీయులు, ధర్మపరుల బాటలో సాగండి. దివ్యమూ, భవ్యమూ అయిన జీవితాన్ని సాగించండి! ఆ వీరబ్రహ్మేంద్రుని కృపకు పాత్రులుకండి!

సర్వేజనా సుఖినో భవంతు.

*భగవత్సేవలో.... సంపాదకులు*

# సనాతన ధర్మము - దాని విశిష్టత

...... స్వామి ముకుందానంద సరస్వతి, ఋషికేష్; 09410990829

(గత సంచిక తరువాయి)

**21. బ్రహ్మచర్యం :**

**శో॥ సూర్యేచాస్తంగతేరాత్రౌ దేహం సంక్షిప్యమారుతిః।**
**పృషదంశక మాత్రస్సన్ బభూవాద్భుత దర్శనః॥**

(వా. రామాయణం)

సూర్యాస్తమయమయిన పిదప దేహాన్ని సంక్షేపించి 'పిల్లి' అంతవాడై అద్భుత దర్శనుడయ్యాడు హనుమంతుడు. అంతట అంతఃపురములో ప్రవేశించి, సీతాదేవి కొరకు వెదుకనారంభించెను. అంతఃపురము ఏకాంతవానము గనుక, పురుషులెవ్వరు లేరను విశ్వాసముతో స్త్రీలు అనేక భంగిమలలోనున్నారు. వారు వివిధ స్థితులలో ఉన్నారు. వారందరిని పరికించి చూచాడు. చూడకూడని ఎన్నో సన్నివేశములను, దృశ్యములను తిలకించాడు. ఎన్నో భంగిమలలో నిద్రిస్తున్న ఎందరో స్త్రీలను చూచినాడు. కాని, వారిలో సీతాదేవి కనిపించలేదు.

అప్పుడు హనుమంతుడు ఇలా ఆలోచిస్తాడు. ఇతరుల యొక్క భార్యలైన ఈ స్త్రీలనందరినీ ఈ విధముగా చూచుట తప్పుకదా! బ్రహ్మచారినైన నేను పరస్త్రీలను చూచుట అధర్మము గదా! ఇచట పురుషులెవ్వరూ లేరను విశ్వాసముతో రావణ స్త్రీలు వివిధ భంగిమలలో నిద్రించుచుండగా చూచాను. ఇది ధర్మలోపం, కాని నా మనస్సుకేమీ వికారం కలుగుటలేదు. శుభాశుభావస్థలో సర్వేంద్రియముల ప్రవృత్తికీ మనస్సే కారణము. ఆ నా మనస్సు సుస్థిరముగా, అచంచలముగ ఉన్నది అని అనుకొంటాడు హనుమంతుడు.

ఎంత ఆశ్చర్యము! అటువంటి అశ్లీల దృశ్యములను చూచినప్పుడు కూడ హనుమంతుని మనస్సు చలించలేదు. మనస్సులో ఎటువంటి వికారమున్నూ కలుగలేదు. దీనినిబట్టి హనుమంతుని యొక్క బ్రహ్మచర్యవ్రతావలంబనము ఎంత సుదృఢమైనదో, ఎంత పటిష్ఠమైనదో అర్థమగుచున్నది గదా!

హనుమంతుడు బ్రహ్మచర్య వ్రతపాలనలో పరాకాష్ఠనందుకొన్న అద్భుతవ్యక్తి.

బ్రహ్మచర్యవ్రత పాలన యొక్క ప్రాముఖ్యతను సనాతన ధర్మము రామాయణ పాత్రల ద్వారా ప్రబోధించుచున్నది.

బ్రహ్మచారియైన వ్యక్తి అశ్లీల దృశ్యములను చూచుట చాలా ప్రమాదకరము. అట్లు జరిగినప్పుడు, అతని జీవితములో అవాంఛనీయమైన పరిణామములు కలిగి, పతనమగుట కవకాశము గలదు.

ఒకప్పుడు, గొప్ప తపసంపన్నుడైన సౌరభమహర్షి నీటిలో చేపల రతి విలాసాన్ని తిలకిస్తాడు. వెంటనే ఆయన మనస్సు చలించి, వివాహ మాడవలయునను వాంఛ ఉత్పన్నమాయెను. ఆ మహర్షి మాంధాతరాజు వద్దకు వెళ్ళి, రాజును ఒప్పించి, ఏబది మంది రాజకుమార్తెలను వివాహమాడెను. ఒక్కొక్క భార్యకు వందమంది సంతానము కలిగెను. ఆ విధముగా సంసారము పెరిగిపోయెను. ఆ మహర్షి సంసార లంపటములో పడి, తన తపశ్శక్తినంతయు కోల్పోవుటతో, ఆధ్యాత్మిక పతనము సంభవించెను.

కాబట్టి, ముముక్షువైన వ్యక్తి అశ్లీల దృశ్యములను

చూచుటగాని, కామాతురు (కామ విషయములనే ఎల్లప్పుడు చర్చించువారు లేక కామవాంఛ ఎక్కువగా కలిగినవారు) లైన వ్యక్తుల యొక్క సాంగత్యమును కలిగియుండుట గానిచేయరాదు.

ఈ విషయమును శ్రుతి ఇట్లు చెప్పుచున్నది :

**"సంగం త్యజేత మిథునవ్రతీనాం ముముక్షుః"** - ముముక్షువైన వాడు కామాతురులైన వ్యక్తుల సాంగత్యాన్ని విడిచివేయాలి".

బ్రహ్మచారులకు, సన్యాసులకు ఒక ఆంక్ష విధించింది సన్యాసోపనిషత్తు. అదేమిటనగా - **"స్త్రియమహిమివ"** "స్త్రీని పాములా త్యజించాలి" అని శాసించింది బ్రహ్మచారులను, సన్న్యాసులను.

సుందర స్త్రీలనెడి వలలలో చిక్కుకొనవద్దని పురుషులను మేల్కొలుపుచున్నది మహోపనిషత్తు.

**మం.॥ కామనామ్నా కిరాతేన వికీర్ణా ముగ్ధచేతసః।**

**నార్యో నరవిహంగానా మంగబంధనవాగురాః॥ (3-45)**

'కామనామ కిరాతుడు, పురుషులు అను పక్షులను బంధించు నిమిత్తమై సుందర స్త్రీలనెడి వలలను విసురుచున్నాడు'.

కావున, ఆ వలల నుండి తప్పించుకొనుమని శ్రుతి భోధించుచున్నది పురుషులకు.

ఆ వలల నుండి తప్పించుకొనిన యెడల గలుగు ప్రయోజనమును తదుపరి మంత్రము బోధించుచున్నది.

**మం॥ స్త్రియం త్యక్త్వా జగత్త్యక్తం జగత్త్యక్త్వా సుఖీభవేత్. (3-48)**

'స్త్రీని త్యజించిన జగత్తును త్యజించినట్లు. జగత్తును త్యజించి సుఖవంతుడగును.

'స్త్రీని, భోగేచ్ఛను వదలి ఆత్మోన్నతికి సాధన చేయాలి' అనెడి హితవును అన్నపూర్ణోపనిషత్తు చక్కగా బోధించుచున్నది.

**"భోగేచ్ఛాం దూరతస్త్యక్త్వా త్రయమే తత్సమాచర" ॥ (4-82)**

**"వాసనాక్షయ విజ్ఞాన మనోనాశో మహామతే!" (4-43)**

'భోగేచ్ఛను దూరంగా వదలి తత్త్వజ్ఞానం, మనోనాశనం, వాసనాక్షయాలనెడి మూడింటిని చక్కగా ఆచరించు' అని శ్రుతి ప్రభోధించుచున్నది.

గృహస్థులకు కూడా బ్రహ్మచర్యం విధించబడినది. 'సరైన ఋతుకాలంలో నియమానుసారం భార్యాభర్తలు సంగమించి, సత్సంతానమును బడయుట గృహస్థబ్రహ్మచర్యం (ఋతౌ భార్యాం తదా స్వస్య బ్రహ్మచర్యం తదుచ్యతే) అని చెప్పబడినది' యని జాబాల దర్శనోపనిషత్తు తెలుపుచున్నది. (1.13)

బ్రహ్మచర్య మాచరించుట వలన కలుగు వివిధ లాభములు క్రింద వివరింపబడినవి

**(1) "తద్బ్రహ్మ చర్యేణ హ్యే వేష్ట్వాత్మాన మను విన్దతే"**

**(ఛాందోగ్యోపనిషత్తు 8-51)**

బ్రహ్మచర్యం పాటించుట వలన మానవుడు ఆధ్యాత్మికోన్నతిని, తద్వారా ఆత్మను పొందగలడు.

**(2) ".... త త్ప్రజాపతి వ్రతం చరంతి యే మిథున ముత్పాదయంతే..."** **(ప్రశ్నోపనిషత్తు 1-15)**

ప్రజాపతి వ్రతం (గృహస్థ బ్రహ్మచర్యం) ఆచరించువారు పుత్రుడు, పుత్రిక అనెడి జంటను అదృష్టఫలముగ పొందగలుగుతారు.

**(3) "బ్రహ్మచర్య ప్రతిష్ఠాయాం వీర్యలాభః"**

**(పతంజలి యో. సూ 2-38)**

బ్రహ్మచర్యమును పాటించుట వలన అద్భుత శక్తి లభించును.

(4) బ్రహ్మచర్యమును పాటించువారు ధ్యానమునందు ఏకాగ్రతయు, తద్వారా సమాధిని తేలికగా పొందగలరు.

(5) బ్రహ్మచర్యం వలన సామాజిక ప్రయోజనము కలదు. దేశ జనాభాను అదుపులో పెట్టవచ్చును.

కావున, వివిధ వర్గములవారు బ్రహ్మచర్యమును ఆచరించి, తద్వారా లభించు ప్రయోజనములను పొందగలరని సనాతన ధర్మము ఆశించుచున్నది.

(సశేషం

# వేద పరిచయము

అధర్వవేద పరిచయము

.......... ఆచార్య డా॥ మట్టి కృష్ణారెడ్డి ............

(గత సంచిక తరువాయి)

**ఇతరనామములు**

అథర్వవేదం అత్యంత భావనా ప్రేరితమై విరాజిల్లుతున్నది. పారలౌకికమైన విషయాలను, ఐహిక సుఖాలను సమంగా విశ్లేషించేది అథర్వణ వేదం. బ్రహ్మవేదం, భిషగ్వేదం, క్షత్రవేదం, అంగిరోవేదం, అథర్వాంగిరసవేదం, అథర్వవేదం. ఇవన్నీ అథర్వవేదానికి ఉన్న నామాంతరాలు. సమాజంలో అభివృద్ధికి నిదర్శనమైన-సమితి, సభ, రాష్ట్ర, రాజ్య ప్రముఖ పాలనా వ్యవహారాలు అథర్వణవేదమునుండే వ్యాప్తిలోకి వచ్చాయి. ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, కుటుంబజీవనం ఉన్నతంగా ఉండాలనే ఈ సంహిత ప్రబోధిస్తున్నది. కాముకవిశృంఖలత ప్రమాదకరమని, స్వకుటుంబ ప్రయోజనమును బోధించే వేదం ఇది. ఇందులోని ఆయుఃసూక్తం, పృథ్వీసూక్తం, కాలసూక్తం, క్షుద్రసూక్తం మొదలైనవి అనర్ఘమైన భావనామౌక్తికాలు.

**అథర్వవేదం** : కొందరు విద్వాంసులు 'థర్వ' ధాతువు కుటిలత, చలనము, కదలిక మరియు హింస అని అర్థములు వ్రాసినారు. కనుక 'అథర్వ' అన్న పదానికి అకుటిలత మొదలగు అర్థములచే పరబ్రహ్మమును పొందుటకు ఉపయోగించే సంహితగా ఈ వేదభాగాన్ని కీర్తిస్తున్నారు. తొమ్మిది శాఖలుగా విస్తరించిన ఈ వేదము నేడు శౌనకపిప్పలాదులను రెండుశాఖలుగానే మిగిలిపోయినది. పిప్పలాదశాఖ కూడా అసమగ్రముగానే ఉన్నది. శౌనకశాఖమాత్రమే పూర్తిగా లభించుచున్నది. ఈ సంహిత 20 కాండలు, 732 సూక్తములు, 5,987 మంత్రములు కలిగి ఉన్నది.

**బ్రహ్మవేదం** : ఋగ్వేదాది సంహితలలో, హోతృకర్మ మరియు యాగానుష్ఠానము మొదలైనవి ప్రతిపాదించబడినాయి. కానీ యజ్ఞంలో 'బ్రహ్మ' అనే పేరుతో వ్యవహరింపబడుతున్న ఋత్విక్కు యొక్క పనిని నిర్దేశించేది అథర్వణవేదమే. అందువల్ల దీనిని బ్రహ్మవేదమని కూడా పేర్కొంటున్నారు.

**అథర్వాంగీరస వేదం**: ఈ సంహితకున్న అతి ప్రాచీనమైన పేరు ఇది. ఈ పేరును మనం ప్రాచీనమైన 'అథర్వణవేద' సంహితల పుస్తకాల అట్టపైన దర్శించవచ్చును. అథర్వుడు మరియు అంగిరస ఋషుల మరియు వారి వంశీయుల ద్వారా చూడబడ్డ మంత్రసమూహం, ఈ సంహితలో ఉండటం వల్ల ఈ సంహితకు 'అథర్వాంగిరసవేద' మన్న పేరు చేకూరింది. బ్రాహ్మణాలలో మరియు ఛాందోగ్య ఉపనిషత్తులో ఈ పేరు, ఈ సంహితకు అనేక పర్యాయములు ప్రయోగించబడింది. పాశ్చాత్యులు కూడా ఈ సంహితకు విభిన్నమైన అర్థాలను పేర్కొన్నారు. వారి మతాన్ని అనుసరించి 'అథర్వ' మరియు అంగిరస శబ్దాలకు క్రమంగా అభిచారం యొక్క సాత్త్విక, తామసిక విధుల అర్థం ప్రకటింపబడింది. 'అథర్వ' శబ్దానికి అనందం, సుఖం మరియు ఉన్నతికి సంబంధించి పవిత్రమైన అభిచారమునకు ద్యోతకము. 'అంగిరస' శబ్దానికి కారణం సాత్త్విక మరియు తామసిక, విరోధులు, పాపులు మరియు మాయావులు మొదలైనవారికి సంబంధించినవి. వాటికి సంబంధించినవని విరోధరూపకమైన అభిచార కర్మలను ఈ వేదం తెలియజేస్తున్నది. ఈ విధంగా రెండు రూపములైన కర్మకాండలకు ఈ వేదం మూలకారణం కావడంవల్ల,

'అథర్వాంగిరసవేదం'గా పేర్కొనబడుచున్నదని పాశ్చాత్యులు వివరిస్తున్నారు.

**క్షత్రవేదం** : శతపథ బ్రాహ్మణం ఈ వేదానికి క్షత్రవేదమని పేరు ఉన్నట్లు తెలియజేసింది. ఈ సంహిత క్షత్రియులకు వివిధమైన కర్తవ్యములు నిర్దేశించింది. అందువల్ల ఈ వేదానికి క్షత్రవేదమని సహజంగానే పేరు వచ్చింది.

**ఛందోవేదం** : అథర్వవేదానికున్న ఈ పేరు ఋగ్వేదము మరియు స్వయంగా అథర్వవేదము తెలియజేస్తున్నాయి. పురుషసూక్తంలో సర్వహుత యజ్ఞంలో ఉత్పన్నమైన ఋక్, సామ, మరియు యజుర్వేదంతోపాటు ఛందోవేదం కూడా ఉత్పన్నమైనదని తెలియజేయబడింది.

**మహీవేదం** : స్వయంగా అథర్వణవేదం ఈపేరును సూచిస్తున్నది. అథర్వణవేదం 12వ కాండ మహిమాన్వితమైన పృథ్వీసూక్తంతో విరాజిల్లుతున్నది. అందువల్ల ఈ పేరు స్వభావసిద్ధంగా భాసిస్తున్నది.

**భీషగ్వేదం** : భారతీయ వైద్య విజ్ఞానం ఎంత గొప్పదో ఈ వేదం ద్వారా తెలుస్తున్నది. చివరి కాండంలో తప్పించి వివిధ మంత్రాలలో వైద్యశాస్త్రం చెప్పబడి ఉన్నది. వివిధ రోగాలపేర్లు వాటి లక్షణాలు, అవి రాకుండ నివారణ పద్ధతులు, వచ్చిన తరువాత ఉపశమించే పద్ధతులు, ఈ వేదంలో చోటు చేసుకొన్నాయి. విశేషించి జ్వరాన్ని వాటిలో ఉండే వివిధ అంశాలను సమగ్రంగా వివరించింది. దార్శనిక చింతనలో అగ్రగణ్యమైన ఈ వేదం తదనంతరం వచ్చిన ఉపనిషత్తులకు పథప్రదర్శకమైంది.

గోపథ బ్రాహ్మణం, బ్రహ్మమహాత్మ్యాన్ని తెలియజేస్తూ విలక్షణంగా అథర్వణవేదాన్ని కూడా ప్రశంసించింది. మూడు వేదాలు యజ్ఞాన్ని ఒక పక్షంలో సంస్కరించేందుకు సహకరిస్తున్నాయి. బ్రహ్మమనస్సు ద్వారా ఉద్భవించే యజ్ఞం యొక్క రెండవ పక్షసంస్కారాన్ని అథర్వవేదం సమకూరుస్తుందని ప్రశంసించింది.

**ప్రత్యేకాంశాలు** : అథర్వవేదంలోని కొన్ని విశిష్టతలు విలక్షణంగా గోచరిస్తాయి. అథర్వణవేదంలో 1200 మంత్రాలు ఋగ్వేదం నుండి స్వీకరించబడ్డాయి. ఇవి ముఖ్యంగా ఒకటి, ఎనిమిది, పది మండలాల నుండి గ్రహించబడ్డాయి. మిగతా మండలాల నుండి పరిమితంగా గ్రహించబడ్డాయి. అథర్వవేదంలోని విభిన్న కాండలలో మొదటి కాండ నుండి ఐదవ కాండ వరకు ప్రత్యేకంగా సూక్తులలోని మంత్ర సంఖ్య పెరుగుతూ ఉంటుంది - 1వ కాండలో 4-4 మంత్రాలు, 2వ కాండలో 5-5 మంత్రాలు, 3వ కాండలో 6-6 మంత్రాలు, 4వ కాండలో 7-7 మంత్రాలు, 5వ కాండలో 8-18 మంత్రాలు (సూక్తం సంఖ్యకన్న చాలా ఎక్కువ), 6వ కాండలో 142వ సూక్తం మాత్రం ప్రత్యేకమైనది మిగతా సూక్తాలలో 3-3 మంత్రాలున్నాయి. 7వ కాండలో 118 సూక్తాలున్నాయి. వాటిలో ఒక మంత్రం లేదా అరుదుగా రెండు మంత్రాలున్నాయి.

ఈ కాండలన్నింటిలో ప్రథమ సూక్తం, విషయపరిచయ దృష్టిచేత పొందుపరచినట్లు తెలుస్తున్నది. ఎనిమిదవ కాండ నుండి పదునాలుగవ కాండ, పదిహేడవ కాండ మరియు పదునెనిమిదవ కాండలో లభిస్తున్న మంత్రసంఖ్య మధ్య వ్యత్యాసం అధికంగా ఉన్నది. వీటి మధ్య పదుహేనవకాండ పూర్తిగా గద్యాత్మకంగాను, పదహారవకాండలోకూడా ఎక్కువగా గద్యం ఉన్నది. రచనా శైలి దృష్టిలో అథర్వవేదానికి చెందిన గద్య "బ్రాహ్మణ గ్రంథా"లలో గద్యం వంటిదని తెలుస్తున్నది. 19 మరియు 20వ కాండలలో ఎక్కువ భాగం మంత్రాలు ఇంద్రస్తుతి పరాలే. ఈ ఇంద్రస్తుతులు ఋగ్వేదంలో నుండి అవికలరూపంలో స్వీకరింపబడ్డాయి. అథర్వణవేద ప్రాతిశాఖ్యలలో చిట్టచివర ఈ రెండు కాండల ప్రసక్తి నామమాత్రంగా కూడా లేదు.

(సశేషం)

# గుండాల మల్లికార్జున స్వామి

కట్టా నరసింహులు, కడప

పూర్వం ఒక రాక్షసుడు ఈశ్వరుణ్ణి గూర్చి తపస్సు చేశాడు. ఇలా చాలా సంవత్సరాలు గడిచాక ఈశ్వరుడు రాక్షసుని తపస్సుకు సంతోషించాడు. వాని ఎదుట ప్రత్యక్షమయ్యాడు. 'నీ కోరిక ఏమిటో! ఆ కోరిక తీరుస్తా'నన్నాడు. 'నా హస్తం ఎక్కడుంచితే అక్కడ భస్మం కావాలి. ఇదీ నా కోరిక' అన్నాడు రాక్షసుడు. 'ఆ ప్రకారమే వరం ఇచ్చా'నన్నాడు ఈశ్వరుడు. రాక్షసుడు ఆలోచించాడు. ఈ వరం నిజమో అబద్ధమో పరీక్షించాలనుకొన్నాడు. వరం ఇచ్చిన వాడి నెత్తిమీదే చేయిపెట్టాలనుకొన్నాడు. వెంటనే రాక్షసుడు శివుని నెత్తిమీద చేయి పెట్టబోయాడు. తనకు రాబోయే ప్రమాదం పసికట్టాడు శివుడు. రాక్షసుని చేతిలో తాను భస్మం కాకుండా తప్పించుకోవాలి. అది అరణ్య ప్రదేశం. శివుడు పరుగు లంకించు కొన్నాడు. రాక్షసుడు వెంబడిస్తున్నాడు.

శివుడూ రాక్షసుడూ పరుగెత్తుతున్నది శేషాచల పర్వతాల్లో. తిరుమలలో మొదలయిన శేషాచల పర్వతాలు ఇక్కడిదాకా వ్యాపించాయి. తన నీ ప్రమాదం నుంచి తప్పించగలవాడు విష్ణువే అని భావించాడు. రాక్షసుని కంటె వేగంగా పరుగుతీసి విష్ణువును సమీపించాడు. తనకు ప్రాప్తించిన కష్టాన్ని ఏకరువు పెట్టాడు. శివుణ్ణి అక్కడే ఉంచి విష్ణువు రాక్షసునికి ఎదురుగా వెళ్లాడు. రాక్షసుడు శ్రీ మహావిష్ణువుకు నమస్కారం చేశాడు. 'స్వామీ! నేను ఈశ్వరుని కోసం వెతుకుతూ వస్తున్నాను. ఆయన మీకేమైనా ఎదురుపడ్డాడా?' అని అడిగాడు. ఆయన ఈ మార్గంలోనే వెళ్లాడు అనికూడా చెప్పాడు. 'ఆయనతో నీకు పనేమిటి? అది మొదట చెప్పు' అన్నాడు విష్ణువు. 'అయ్యా! పరమేశ్వరుని కోసం నేను చాలాకాలం తపస్సు చేశాను. ఆయన నా తపస్సుకు మెచ్చుకొన్నాడు. వరం కోరుకొమ్మన్నాడు. నా హస్తం ఎక్కడ ఉంచితే అక్కడ భస్మం అయ్యేటట్టు వరం అడిగాను. ఆయన ఇచ్చానన్నాడు. ఆ వరం నిజమో అబద్ధమో పరీక్షించుకోడానికి ఆయన నెత్తిమీదే నా చేయి పెట్టాలనుకొన్నాను. ఆయన నాకు చిక్కకుండా పరుగెత్తుతున్నా'డన్నాడు. 'నేను త్వరగా వెళ్లి ఆయన నెత్తిమీద చేయి పెట్టాలి. నా వరాన్ని పరీక్షించుకోవాలి. అందుకే ఆయన ఇటుగా వెళ్లాడా అని అడుగుతున్నాను. త్వరగా చెప్పండి స్వామీ!' అన్నాడు రాక్షసుడు.

'శ్రీ మహావిష్ణువు చిరునవ్వు చిందిస్తూ నీవు దుర్బుద్ధితో వరం ఇచ్చిన వాణ్ణే భస్మం చెయ్యాలని చూస్తున్నావు. ఇది తప్పు. అయినా నీవు స్నానం చెయ్యకుండానే ఆయన్ని తాకాలనుకొంటున్నావు. ఆయన మూడో కన్ను తెరిస్తే నీవు మాడి మసైపోతావు. కాబట్టి నీవు స్నానం చెయ్యకనే శివుణ్ణి తాకకూడదు సుమా' అన్నాడు. 'అయ్యా స్నానం చెయ్యక శివుణ్ణి తాకకూడదన్నావు. నేను తపస్సుకు కూర్చున్నప్పటినుంచి స్నానం చెయ్యనేలేదు. నీవు

చెప్పినట్లే ఇప్పుడు స్నానం చేద్దామనుకుంటే ఇక్కడ నీళ్లేవి' అన్నాడు రాక్షసుడు. 'ఓయీ రాక్షసా! నీకు స్నానం చేసేటందుకు నీళ్లు కావాలి. అంతే కదా! ఇదుగో ఇక్కడే నీకు నీళ్లు తెప్పిస్తున్నాను. త్వరగా స్నానం చేసి వెళ్లు' అంటూ విష్ణువు తన చేతితో నేలమీది బండను మర్దించాడు. ఆ బండ ముక్కలయింది. ఆ రాళ్లు పెళ్లగించాడు విష్ణువు. అది చిన్న గుండంగా ఏర్పడింది. అందులో కొంచెం నీరు ఉబికి కనిపించింది. 'స్వామీ ఈ కొంచెం నీళ్లతో స్నానం ఎలా చేసేది' అని అడిగాడు రాక్షసుడు. 'ఈ నీళ్లలో నీ దోసిలి మునుగుతుంది గదా! స్నానం చెయ్ ఆలస్యమెందుకు' అన్నాడు విష్ణువు. స్నానం చెయ్యాలనే ధ్యాస తప్ప అలా చేస్తే ఏమౌతుందో గ్రహించలేని రాక్షసుడు వంగి దోసిలినిండా నీళ్లు తీసుకొని తన నెత్తిని తాకిస్తూ పోసుకొన్నాడు. ఇంకేముంది? రాక్షసుడు బూడిదగా మారిపోయాడు.

ఇది శ్రీమహావిష్ణువు లీల. గుండంలోని నీళ్లతో బూడిద కొట్టుకొని పోయింది. అక్కడ నిర్మలమైన గంగ ఏర్పడింది. నాటినుంచి ఆ గుండానికి 'భస్మాసుర గుండం' అని పేరు వచ్చింది. ఆ రాక్షసుని పేరు భస్మాసురుడని ప్రత్యేకించి చెప్పవలసింది లేదు. ఈ వర్తమానం శ్రీ మహావిష్ణువు సాంబశివునికి తెలిపాడు. భస్మాసురుడు తన పాపాన్ని పోగొట్టుకొని బూడిద అయి మోక్షాన్ని పొందాడు. కనుక ఈ గంగలో ఎవరు స్నానం చేసినా పాతకాలు తొలగిపోయి మోక్షం పొందుతారు అని పలికి శ్రీమహావిష్ణువు నిలిచిన తావులో లింగప్రతిష్ఠ చేశాడు. ఈ లింగానికి 'గుండాల మల్లికార్జునుడు' అని పేరుంచాడు.

ఇప్పుడక్కడ ఆలయం వెలసింది. ఈ మల్లికార్జునునికి ఉత్తరంగా 'గుండాల దేవరపల్లె' ఏర్పడింది. గుండాల మల్లికార్జునస్వామిని శివరాత్రి సమయంలోను, కార్తిక సోమవారాల్లోను భక్తులు విశేషంగా దర్శిస్తూ ఉంటారు. మొక్కులు చెల్లించుకొనేవారు అప్పుడప్పుడు సంతర్పణలు చేస్తూ ఉంటారు.

వేముల పాలెగాడు కుమార వెంకటపతినాయుడు అంజనం వేయించి మల్లికార్జునస్వామికి ఎదురుగా ఉన్న బసవన్న (నంది) కింద నిధి ఉందని తవ్వించాడు. ఇందుకోసం బసవన్నను పక్కకు జరిపించాడు. ఎర్రబండ్ల గ్రామస్థులు యథాప్రకారం అరుగు వేయించి బసవన్నను నిలిపారు. కుమార వెంకటపతినాయుడు మరణించిన తరువాత వెంకటప్పనాయుడు మల్లికార్జునస్వామి లింగాన్ని పక్కకు జరిపి ఆచోట తవ్వించి వెళ్లిపోయాడు. ఎర్రబండ్ల గ్రామస్థులు లింగాన్ని యథాప్రకారం ఉంచి సంప్రోక్షణ అభిషేకం చేయించారు.

బ్రాహ్మలు మొదలు శూద్రులు దాకా ఈ స్వామిని సేవిస్తూ ఉండేవారు. భస్మాసుర గుండంలో స్నానాలు చేసేవారు. మగసంతానానికి మల్లప్ప అని, ఆడసంతుకు మల్లమ్మ అని పేరు పెట్టుకొనేవారు.

సుబ్బావధూత అనే ఆయన ఒక సంవత్సరం స్వామి దగ్గర నివాసం చేసి కొంత ద్రవ్యం సంపాదించి దేవునికి నందివాహనం, వ్యాఘ్రవాహనం, పికిలికూటం, ఆందోళిక చేయించాడు. పార్వతీపరమేశ్వరుల తామ్ర విగ్రహాలు చేయించాడు. ఉత్సవాలు జరిగేవి. ఈ ఉత్సవాలలో ఏకర్లు బహుళంగా పాల్గొనేవారు.

గ్రామంలో వీరారెడ్డి దత్తపుత్రుడు మలిరెడ్డి అనేవాడు విద్యలో బుద్ధిమంతుడై ఉండేవాడు. వాడొకనాడు నేను రేపటిదినం నిర్యాణం

➤ తరువాయి 13వ పేజిలో.......

# ఆత్మ జ్ఞానంతో ఎప్పడూ ఆనందమే

... జి.వి. శేషారెడ్డి, సెల్ : 9440424322

ఆలోచనలు మనిషిని మహర్షిని చేస్తాయి. ఆలోచనలే మానవుని దానవునిగా చేస్తాయి. సకారాత్మకంగా ఆలోచించ కలిగినపుడు అంతా ఆనందమే. నానాటి బ్రతుకు నాటకమన్న అన్నమయ్య పలుకులను గుర్తుచేసుకొంటే మానవజీవితము క్షణబంగురము. ఈ జన్మకు ఆత్మజీవనమే శరణ్యమన్న విషయము విధితమవుతుంది. ప్రాపంచికములో ఉంటూ తామరాకుపై నీటి బొట్టు చందంలాగ మనిషి జీవితాన్ని బాధ్యతాయుతంగా మలచుకోవాలి. అప్పుడు తృప్తి, సంతృప్తి మిగులుతాయి. యోగివేమన చెప్పినట్లు పుట్టలోని చెదలు పుట్టదా, గిట్టదా అన్న విధంగా జీవితాన్ని గడిపితే మానవజన్మకు సార్ధకత ఎక్కడ. "యవ్ ఆలోచన తత్ ఫలితం" ఆలోచనలను బట్టి ఫలితము ఉంటుంది. చేయికున్న ఐదువేళ్ళు ఒకే విధంగా ఎలా ఉండవో ఈ ప్రపంచములోని మనుష్యుల మనస్ తత్వాలు కూడా భిన్నంగా ఉంటాయి. మనలను ఇతరులు అర్థం చేసుకోలేదని బాధపడేకన్నా వారిని అర్థం చేసుకోవడం ఉత్తమం అన్న ఆలోచన కలిగిన మనుష్యుల జీవితాలు స్వర్గపు నిలయాలు. నేనింతే, నా ఆలోచన ఇంతే అని అనుకోవడం జడత్వము. మనసుకు ఒక ఆలోచన నచ్చలేని తరుణంలో మనసుకు నచ్చ చెప్పుకోవడం అత్యుత్తమమైన ప్రక్రియ. అంతేకాని ఆ ఆలోచనతో క్షోభను అనుభవించడము భావ్యముకాదు. ఆలోచించే విధానాన్ని బట్టి ఫలితము ఉంటుదన్నది కథా కర్మ సిద్ధాంతము. ఎందుకంటే ఆలోచనను బట్టి మనము చేసే పనులుంటాయి. ధర్మబద్ధమైన ఆలోచనలు మనసును కుదుటపరుస్తుంది. ఊరట కలిగిస్తుంది. మనసు పెళుసు, మనసు అరిటాకు చందంలాగా, ముళ్ళు అరిటాకును గుచ్చుకొన్న, అరిటాకు ముళ్ళును గుచ్చుకొన్న పాడయ్యేది అరిటాకు. మనసుకూడా అంతే. అందుకే మన ఆలోచనలకు తగినట్లు ఎదుటి వ్యక్తి నడుచుకోలేదు అని" బాధపడేకన్నా ముందు మనలను మనము సంస్కరించుకొందాం. సకారాత్మక ఆలోచనలు ప్రతి మనిషిని సంస్కరిస్తుంది, సత్కరిస్తుంది. ఆలోచన కుమ్మరి సారెమీద మట్టి ముద్దలాంటిది. కుమ్మరి సారెమీద నున్న మట్టిని తనకు కావలసిన విధంగా కుండలను తయారుచేసుకొన్నట్లుగా, ప్రతి మనిషి ఆలోచనలను తనకు అనుగుణంగా అంటే ధర్మబద్ధంగా, బాధ్యతాయుతంగా మలచుకోగలిగితే ప్రతి మనిషి జీవితము నందనవనము.

అవసరాన్ని పట్టి, సంఘటన పట్టి ఆలోచనలు మనిషిని తేనేతుట్టెలోని తేనే టీగల్లాగ చుట్టుముట్టుతాయి. చెట్టుకు పూసిన పూతంత కాయలుగా మారనట్లు, మెదడులోని ఆలోచనలన్ని సత్ ఫలితాలను ఇవ్వవు. అందుకే ఆలోచనల్లో ఎదగాలి, సకరాత్మకంగా ఆలోచించాలి. ఆత్మజ్ఞానాన్ని ఆలోచనలకు ఆపాదించాలి. అప్పుడు ఏ వ్యక్తి అయిన పరిపూర్ణుడుగా తీర్చిదిద్దపడతాడు. జీవితాలు నరకాలు, స్వర్గాలుగా మారేది ఆలోచనల పట్టేకథా! ఆలోచనల సంఘర్షణ ఆలోచనల్లో పరిపక్వత లేనపుడు జరుగుతుంది. శిల్పి చేతుల్లో యేబండరాయి అయిన శిల్పంగా మారుతుంది. చిత్రకారుని చేతుల్లో ఏ

ఆలోచన అయిన బ్రహ్మాండమైన చిత్రంగా తనకుంచెతో గీయగలడు. అదే విధంగా ధర్మబద్ధమైన, సకారాత్మకమైన ఆలోచనలను ప్రతి మనిషి తమకు అనుగుణంగా మార్చుకోగలడు. మార్చుకోవాలి. ఆలోచన వేరులాంటిది. చెట్టుకు వేరు ముఖ్యం. ''వేరు పురుగు చేరి వృక్షంబు చెరచు''. వృక్షం మృగ్యం కావడానికి వేరుపురుగు కారణమయితే ఆలోచన అనే వేరుకు సకారాత్మక అన్న వేరుపురుగు చేరితే మనిషి జీవచ్ఛంలాగా బ్రతుకుతాడు. అందుకే ప్రతి ఆలోచనకు మూలం ఆత్మజ్ఞానము. ఆత్మజ్ఞానము పరిపూర్ణత్వాన్ని ఇస్తుంది. భగవద్గీత ఆత్మజ్ఞానాన్ని ప్రబోధించిన మహత్తర గ్రంథం. భగవంతుడైన శ్రీకృష్ణ పరమాత్ముడు బోధించిన ఆత్మజ్ఞానం అర్జునుని కార్యోణ్ముఖున్ని గావించి ధర్మంకోసం కురుక్షేత్రం జరిగింది. ధర్మ పరిరక్షణకోసము జరిగే ఏ యుద్ధమైన, ప్రయత్నమయిన కురుక్షేత్రమంటాం కదా! రాగద్వేషాలు లేనపుడు ఎవ్వరైనా సరే దైవాన్నిపోలి ఉంటారు. ప్రాపంచిక జీవనంలో అర్జునుడనేకాదు మనమెవ్వరము బాధ్యతాయుతమైన జీవనాన్ని ఇష్టపడటంలేదు. ఆనందమయిన జీవితాన్ని కోరుకొంటాం. అంటే వందేళ్ళ జీవితంలో మనం అనుక్షణం ఆశిస్తోంది శోకరాహిత్యాన్ని, ఆనందప్రాప్తిని. ఈ రెండింటి మధ్య ఆటుపోట్లన్నీ జీవనఘర్షణలే దైహిక అనుభూతులు, దైనందిన అనుభవాలు వెరశి ప్రాపంచిక జీవనం కదా! ఆనందప్రాప్తి, అందుకే ఆత్మానందానికి సరితూగగల ఆనందం మరొకటి లేదంటారు. ఈ ఆత్మజ్ఞానం మనకు సొంతం కావాలంటే మనకు కావలసింది ఆత్మజ్ఞానం. సెల్ఫ్ నాలెడ్జ్ అంటే మనకు మనంగా మన విషయంలో జ్ఞాన ప్రపూర్తులం కావటం. భగవద్గీతలో శ్లోకాలను వల్లె వేయటం వల్ల, ఆ తత్వాన్ని జీర్ణం చేసుకోవటం వల్ల ''గీత'' సజీవ చైతన్య స్రవంతిలా మన ఆలోచనలను సస్యశ్యామలం చేస్తుంది. నిన్నటిని, నేటిని, రేపటిని ముడివేసిన త్రివేణి సంగమంలా దర్శనమిస్తుంది. మనలను పాశవిక, దానవ ప్రవృత్తుల నుండి దాటవేయటానికి ఒక వంతెన అవుతుంది. ఇహం నుండి పరానికి చేర్చి మానవత్వంలో దైవత్వాన్ని నింపటానికి సహకరిస్తుంది. అసలు ''అశచ్యానన్వశోచస్త్వం'' అని కదా గీతోపదేశం ప్రారంభమవుతుంది. అంటే శోకింపతగని వారి గురించి శోకించటం అనే అర్థం మనకు స్పష్టంగా తెలుస్తున్నప్పటికి అనవసరాలను తలకెత్తుకుంటూ బాధపడటం అన్నది అంతరార్థం. మాశుచం అంటూ గీతోపదేశం పూర్తవుతుంది అంటే శోకించకూడదు అని పైకి ధ్వనిస్తున్నా అంతరార్థం మాత్రం అనవసరాల కంట పడకూడదు. అన్నదే! దైహికంగా బొలుక వనరులపై మక్కువ పెంచుకుంటున్నంతకాలం, ప్రాపంచిక సంపదలకోసం అర్రులుచాస్తున్నంత కాలం బాధను కౌగిలించుకొనే ఉంటాం. శోకపొత్తిళ్ళలోనే ముడుచుకుపోతుంటాం. ఎందుకంటే ఆత్మజ్ఞానమే నిజమైన జ్ఞానమని తెలుసుకోలేక పోవడంవల్లే కదా! నశించనిది ఆత్మ కాబట్టి, అది సత్యమూ, శాశ్వతమూ కాబట్టి అకర్తగానీ, అబోక్తగానీ వ్యవహరిస్తుంటుంది. యుద్ధభూమిని ప్రవేశించిన తర్వాత కూడా పారుసలపనని అర్జునుడు మొండికెయ్యటం అనివార్య పనుల్ని సైతం వాయదా వేయటానికి లేదా ముఖ్యపనుల నుండి తప్పించుకోవటానికి ప్రయత్నించే మనవంటి వారి మనస్తత్వానికి పడకనే. సకల శాస్త్ర పారంగతుడైన అర్జునుడికి ఇది తగదు అని తెలును. మనమూ అంతేతప్పదని తెలిసి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తుంటాం. దైహికంగా బొలక వనరులపై మక్కువ పెంచుకున్నంత కాలం

ప్రాపంచిక సంపదలకోసం అశ్రులు చాస్తున్నంతకాలం భాధను కౌగిలించుకునే ఉంటాం. శోక పొత్తిళ్ళలోనే ముడుచుకుపోతుంటాం. నిజానికి ఆ నిత్య దేహం కోరుకుంటున్న దాన్ని ఏదో ఒకనాటికి నశించేవి. ఇది తెలుసుకోలేకనే వాటివెంట పడుతున్నాం. నశించనిది ఆత్మ కాబట్టి, అది సత్యమూ, శాశ్వతమూ కాబట్టి అకర్తగానే, అభోక్తగానే వ్యవహరిస్తుంటుంది. అందుకే ఆత్మజ్ఞానము పొందగలిగితే అంతులేని ఆనందాన్ని పొందగలం.

దైనందిన జీవితం అటాచ్‌మెంట్‌లలో భౌతికంగా బందీ అయిపోతుంటే సాధనా జీవితం అటాచ్‌మెంట్లలో స్వతంత్రిస్తుంటుంది. అంటే అటాచ్‌మెంట్‌లకు డిటాచ్‌మెంట్‌లకు సమప్రాదాన్యత నివ్వడమే సంయమనం. అదే సాధనా ఫలితం. అనురాగానికి, మోహనికి బంధుత్వం ఎక్కువ. ఆ బంధుత్వం బెడిసి కొట్టినపుడు బాధ తప్పదు. శోకించక తప్పదు. ఈ లౌకిక బలహీనతల నుండి బయటపడాలంటే మనం అలోకంగా వ్యవహరించక తప్పదు. దీనికి కావలసిందే తత్వ దర్శనం. దేహతత్వము నుండి బయటపడి ఆత్మతత్వానికి ఆకర్షితులం అయితే తప్ప మనకు ఆత్మజ్ఞానం అందిరాదు. ఈ ఆత్మజ్ఞానానికి కావలసింది ధ్యాన మగ్నత, యోగ సాధన, మొత్తానికి సాధనా క్రమంలో మనకూ దేహధర్మము తేలియాలి. ఆత్మధర్మము తెలియాలి. అపుడే సృష్టి ధర్మము తెలిసివచ్చేది. సృష్టిధర్మం ఎరుకు అయితే మనకు ఈ భౌతిక వర్తనం గురించి అర్థం అవుతుంది. కాబట్టి మనం దేహతత్వాన్ని, ఆత్మతత్వాన్ని విచారిద్దాం.

దేహం వికారాల పొత్తం - ఆత్మనిర్వికారం
దేహానిది వినాశనత్వం - ఆత్మ అవినాశి
దేహానిది పరిమితత్వం - ఆత్మ సర్వగడం
దేహానిది బహుళతత్వం - ఆత్మ ఏకత్వం
దేహానికే ప్రమేయాలు - ఆత్మ అప్రేమయం
దేహానిది అశాశ్వతత్వం - ఆత్మ శాశ్వతం
దేహం నిరంతర వ్యక్తం - ఆత్మ అవ్యక్తం
దేహ వర్తనం బుద్ధిగతం- ఆత్మ అచింత్యం
దేహం సకల గుణరాశి - ఆత్మ నిర్గుణం
దేహానిది రూపలావణ్యం- ఆత్మ అరూపం
దేహానిది కర్తవ్యం - ఆత్మ అకార్త
దేహం భోక్త- ఆత్మ అభోక్త
దేహానిది కర్మఫలతృష్ణ- ఆత్మ అకర్మ
దేహం పాంచభౌతికం- ఆత్మ ఆది భౌతికం

---

➢ 10 వ పేజి తరువాయి ......

అవుతున్నానని చెప్పాడు. చెప్పినట్లే మరుసటిదినం దేహం చాలించాడు. మలిరెడ్డి కోరినట్లుగా గుడిదగ్గర సన్యాసవిధిగా సమాధి చేయించారు. సమాధి మీద లింగం పెట్టి గుమ్మటం కట్టించారు. ఈ సమాధి మల్లికార్జున స్వామికంటె ఉన్నతంగా తయారయింది.

తిరిగి కొంత కాలానికి మల్లికార్జునస్వామి లింగాన్ని తొలగించి తవ్వారు. దేవాలయం పాడుపడిపోయింది.

ఇటీవల మళ్లీ కొంత ఆలయం పునరుద్ధరణ జరుగుతూ ఉంది. ఎత్తైన శేషాచలం కొండ దిగువగా ఆలయం ప్రశాంత వాతావరణంలో ఉంటుంది. గుండం నుంచి ప్రవహించే జలంతో దిగువన పంటలు సాగుచేసుకొంటున్నారు.

పులివెందుల సమీపంలోని శేషాచలం కొండల్లో గుండాల మల్లికార్జునస్వామి గుడి ఉంది. శ్రీ మహావిష్ణువు నేలచరిచి పుట్టించిన జలం ఇప్పటికీ ప్రవహిస్తూ ఉంది. ఈ గుండం నుంచి వచ్చే నీటితో వంద ఎకరాల పంట సాగవుతూ ఉంది.

# ఆది గురువు ఆచార్య శంకరులు

- శ్రీమతి జానమద్ది స్వర్ణలతా జోషి

(గత సంచిక తరువాయి)

## మండన మిశ్ర ప్రకరణ

తుషాగ్నిలో వున్న కుమారిలభట్టు 'ముందు నాకు మీ దర్శనభాగ్యం లభించివుంటే నేను ఈ ప్రాయశ్చిత్తం చేసుకునేవాడినికాను. శాబర బాష్యానికి వార్తికను వ్రాసిన తమ భాష్యానికి నేను కూడా కొంత వ్రాసి కీర్తి పొందే భాగ్యంలేకపోయింది.' అని కుమారిల భట్టు పశ్చాత్తాప పడుతూ వుంటే శంకరులు కమండ లోదకం చేత నీకు ఉజ్జీవనం కలిగిస్తాను (ఉజ్జీవ యామి కరకాంబు గణోక్షణేన) అని, అది లోకవిరుద్ధం. కావున అది వద్దు అన్నాడు. 'తారకమైన బ్రహ్మతత్వాన్ని ఉపదేశించి కృతార్థుని చేయండి' అని ఆచార్యులు అడుగగా "మీకు నేను చెప్పగలిగిందేమీ లేదు. ఇదే మార్గంలో మండన మిశ్రుడనే మహా విద్వాంసుని మీరు జయించగలిగితే అందరినీ జయించినట్లే. ఎప్పుడూ యోగా మార్గాన్ని ప్రశంసిస్తూ, వాదిస్తూ, తానే విశ్వరూపుడని ప్రసిద్ధి చెందాడు. వైదిక మార్గ తత్పరుడు, ప్రవృత్తి శాస్త్ర నిరతుడు, నివృత్తి శాస్త్ర విముఖుడు. అతనిని జయించు. అతడు తన భార్యను ఉంబే అని పిలుస్తాడు. ఆమె దూర్వాసుడి శాపం వలన భూమిపై అవతరించిన సరస్వతి. ఆమె పేరు ఉభయభారతి. అతడు సర్వశాస్త్రములలోనూ నన్ను మించినవాడు. నా ప్రియశిష్యుడు. అతని భార్యనే సాక్షిగా పెట్టుకొని వాదంలో అతనిని జయించి తమ కృతులకు వార్తికను వ్రాయించండి." అన్నాడు. ఆ తరువాత శంకరులు మండన మిశ్రునితో చర్చాగోష్ఠి జరపడానికి మాహిష్మతీ పురానికి బయలుదేరారు.

శాబర భాష్యానికి కుమారిలభట్టు వార్తికను వ్రాసినట్లుగా సూత్ర భాష్యానికి కూడా ఆయనే వార్తికను వ్రాస్తే బాగుంటుందన్న అభిప్రాయం కూడా వుంది. వ్యాసాచలీయంలో 'అష్టే సహస్రాణి విభాంతి విద్వాన్ సద్వార్తికానాం ప్రథమేత్ర భాష్యే। అహం యది స్యామ గృహీత దీక్షో ధృవం విధాస్యే సునిబంధమస్య' అన్న శ్లోకం ద్వార స్పష్టమవుతుంది.

కాని చిద్విలాసీయంలో ఇలా వ్రాయబడింది. 'నేను చేసిన పాపానికి శాస్త్రబద్ధమైన ప్రాయశ్చిత్తాన్ని నేనే నిశ్చయించుకున్నాను. నా పుణ్యఫలం వలన మీరు సరిగా సమయానికి వచ్చారు. ఇంకా కాసేపట్లోనేను ప్రాణాలు త్యజిస్తాను' అన్న బట్టు మాటలకు ఆచార్యులు 'మీకు గీతార్థం తెలియలేదు కదా! చంపేదెవరు ? చచ్చేదెవరు ? అంతా దైవాజ్ఞ ప్రకారం జరుగుతుంది' అన్నారు. అందుకు భట్టు ఆశ్చర్యంగా 'ఎవరో యతి శ్రేష్ఠమైన భాష్యాన్ని వ్రాశారని విన్నాను. బహుశా మీరే కాబోలు. అదే భాష్యమై వుంటుంది. మీరు వ్రాసిన భాష్యాన్ని చూస్తే కాని ఏమీ చెప్పలేను. సగం కాలిన నా శరీరంలో బుద్ధి నిశ్చలంగా ఎలా వుంటుంది? మరలా జీవించేది ఎలా ? అందువలన మీరు కాశ్మీరానికి వెళ్ళండి. అక్కడ మండన మిశ్రుడన్న నా ప్రియ శిష్యుడున్నాడు అతనికి దాదాపు ఇరవై సార్లు జైమిని సూత్రముల అర్థాన్ని వివరించాను. అతనికి కర్మమే బ్రహ్మము. బ్రహ్మాంశతో పుట్టినవాడు. అతనికి 'సరాసవాణి' అన్న భార్యవుంది. స్వరస్థాలిత్యానికి ఆమె నవ్విందని ఆ తప్పుకు 'మనిషివై పుట్ట'మని

దూర్వాసుడు శాపమిచ్చాడట. దానితోబాటు మనుష్యరూపంలో వున్న శివుని దర్శనం కలిగినప్పుడు శాప విముక్తి కలుగుతుందని కూడా చెప్పారు. అందువలన ఆమె భారతిగా జన్మించి మండన మిశ్రునికి భార్య అయింది. మీకు వాదించాలన్న కోరిక వుంటే ఆయన దగ్గరకు వెళ్ళండి. అతనిని జయించి, ఆయనకు సన్యాసమిచ్చి అతనిచేత వార్తికను వ్రాయించుకోండి' అని చెప్పి లేవలేక మనస్సులోనే భక్తితో నమస్కరించి ఆచార్యులను ప్రశంసిస్తూ పంపించారు అని వ్రాయబడింది.

ఇదే సన్నివేశాన్ని ఆనందగిరీయంలో ఇలా వర్ణించారు. 'అజ్ఞానం వల్ల నీకు ఈ అవస్థ వచ్చింది' అన్న ఆచార్యుల మాటలకు మోకాళ్ళ దాకా కాలిన శరీరంగల కుమారిల భట్టు ' ఈ అకాలంలో వచ్చిన కొత్త బౌద్ధుడెవరు ? ఎందుకు వచ్చాడు?' అని ప్రశ్నించాడు. 'నేను బౌద్ధుడను కాను. శంకరాచార్యుడిని. శుద్ధ అద్వైత మార్గావలంబిని మీతో వాగ్వాదం చేయడానికి వచ్చాను.'. అన్నాడు. దానికి భట్టు 'అలా అయితే ఉత్తర దేశంలో నా చెల్లి భర్త మండన మిశ్రుడున్నాడు. అతడు సర్వజ్ఞుడు. సకల విద్యకూ పితామహుడు. మీ నోటి దురద తీరేదాక ఆనందంతో వాదించండి. నేను కర్మసూత్ర బద్ధుడనై పరలోక యాత్రకు బయలుదేరుతున్నాను' అని కళ్ళు మూసుకొని బుద్ధిని, బ్రహ్మలో లీనం చేశారు. ఇందులో మాహిష్మతీ పురాన్ని గురించి కాని, మండనమిశ్రుడు కుమారిల భట్టుకు శిష్యుడని కాని చెప్పబడలేదు.

మాధవీయంలో మండన మిశ్రుడే విశ్వరూపుడని భూమిపై ప్రసిద్ధి చెందునని చెప్పబడింది. (స విశ్వరూపః ప్రథితో మహీతలే). వ్యాసాచలీయంలో మండన మిశ్రుని వృత్తాంతం ప్రారంభమవుతుంది.

**తత్పార్శ్వవతీ విదితార్థ సంగ్రహః।**
**స మండనా ఖ్యో భిజగామ శంకరమ్॥**

(కుమారిల భట్టు ప్రక్కనే వుండి విషయమంతా తెలిసిన మండనుడనే పేరుగలవాడు శంకరాచార్యుల దగ్గరకు వెళ్ళాడు).

అలా వెళ్ళి మీ గురించి అంతా తెలుసుకున్నాను. ఇప్పుడు 'మీ దర్శనం కలిగింది. నా సేవలను స్వీకరించి నన్ను ఉద్ధరించాలి' అని ఆచార్యులను అడిగాడు. అందుకు ఆచార్యులు మండనితో ఇలా అన్నారు 'శ్రుతి చోదితమైన కర్మలనే చేయి. దాని వలన అంతఃకరణ శుద్ధి జరుగుతుంది'. పరిశుద్ధమైన అద్దంలో మొహం చక్కగా కనబడినట్లుగా ఆనంద స్వరూపమైన బ్రహ్మ కనబడుతుంది'. అని చెప్పి,

**త్యక్త్వా మండన భేదగోచరధియం మిథ్యాభిమానాత్మిక**
**మద్వైతే భవనిష్ఠతో మమ వచస్తే రోచతే యద్యతిః**
**తీర్త్వా సంస్కృతి వారిధిం పరపదే జ్ఞానప్లవారోహణాత్**
**పారే స్థాస్యసి నిర్వృతః సుఖమయో సంసార వార్తోంకితే॥**

(ఓ మండన మిశ్రుడా! నా మాటలు నీకు సరియైనవని అనిపిస్తే భేదవిషయమైన, మిథ్యాభిమాన రూపమైన బుద్ధివాదాన్ని వదలి అద్వైతంలో స్థిరపడు. జ్ఞానమనే నిచ్చెనను ఎక్కడం వలన సంసార సాగరాన్ని దాటి సంసార వాసనలే లేని ఆవలి ఒడ్డున సుఖంగా, ఉపరతుడవై వుండగలవు)

మాధవీయంలోని ఎనిమిదవ సర్గలో

అథ ప్రతస్థే భగవాన్ ప్రయాగాత్తన్మండనం పండిత మాశుజేతుమ్।

గచ్ఛన్ ఖసృత్యా పురమాలు లోకే మాహిష్మతీం మండన మండితం సః

(ఆ తరువాత భగవంతుడైన ఆచార్యులు ప్రయాగ నుండి మండన పండితుని త్వరగా గెలవాలని ఆకాశ మార్గం ద్వారా పోతూ మండనాలంకృతమైన మాహిష్మతి

పురాన్ని చూచారు)

వ్యాసాచలీయంలోని ఆరవ సర్గలో

**అథ ప్రతస్థే భగావాన్ ప్రయాగాత్**

**దిదృక్షమాణో గృహి విశ్వరూపమ్**

**విహాయసా యోగభవేన గచ్ఛ**

**న్నవాతరత్తస్య గృహాంగణాంతమ్॥**

అన్న శ్లోకం ప్రారంభంలో వుంది.

(భగవంతుడైన ఆచార్యులు గృహస్థుడైన విశ్వరూపుని చూడవలెనన్న ఆశతో యోగబలం చేత ఆకాశం మార్గం ద్వారా అతని ఇంటి ముంగిట్లో దిగినాడు)

### మండన మిశ్రునితో వాదం

ఆచార్య శంకరులు మహిష్మతీ పురానికి దగ్గరవున్న కమలవనంలో విశ్రమించి ఆహ్నికాలను ముగించి ముందుకు సాగుతూ మండనుడి ఇంటిలోని దాసీ జనాన్ని చూచి 'మండన పండితుని ఇల్లెక్కడ?' అని అడిగారు. అందుకు ఆ దాసీ జనులు 'స్వతః ప్రమాణ. పరతః ప్రమాణ, కర్మవే ఫలాన్నిస్తుంది. ఈశ్వరుడే ఫలాన్నిస్తాడు. జగత్తు నిత్యము అనిత్యము' అంటూ వాకిట్లోని పంజరాలలో వున్న ఆడచిలుకలు చెబుతుంటాయో అదే మండన పండితుని ఇల్లు' అని చెప్పారని మాధవుడు వర్ణించాడు.

చిద్విలాసంలో బ్రాహ్మణుడి ద్వారా ఇలా ఉత్తరాన్ని చెప్పించాడు. 'ఆ ఇంటిపేరు విద్యాలయం. అది తాటి చెట్టంత ఎత్తుగా వుంది. దాని చుట్టూ ప్రహరీగోడ, ముఖద్వారము వుంది. దానికి నూరు రాతి స్తంభాలున్నాయి. గర్భాగారము, ఈశ్వరాగారము, శయ్యాగారము కూడా వున్నాయి. ముందువైపు విశాలమైన పాఠశాలలు వున్నాయి. పది అడుగుల ఎత్తైన ఒక అరుగు మీద గురువు కూర్చుని తన శిష్యులకు పాఠం చెబుతుంటాడు. ఇంటికి రెండువైపులా వీధులను నిర్మించి ఆయా స్థలాలలో వేదవేదాంగాలు పురాణాలను నేర్పుతుంటారు. చుట్టూ వున్న పంజరాలలో చిలుకలు పండితులలాగా పాతంజల, కాపిల, జైమినీ సూత్రములను గురించి ప్రసంగిస్తూ వుంటాయి. ఋగ్, యజుస్సామ వేదాలను గానం చేస్తూ వుంటాయి. కావ్యవాచనం చేస్తుంటాయి. వాటిల్లో కొన్ని చిలుకలు కర్మమే సత్యమని చెబితే మరికొన్ని అది పూర్వపక్ష విచారమని మరికొన్ని చెబుతుంటాయి.

ఆనందగిరీయంలో ఆచార్యశంకరులకు దాసీ జనం చెప్పిన ఉత్తరం ఇలావుంది. అందులోని వర్ణన ఇలా వుంది. 'విద్యా (నిలయం) పురం దక్షిణ దిక్కులో మండన మిశ్రుడు తాటిచెట్టు ప్రమాణంలో ఎత్తైన పాఠశాలను నిర్మించి, దాని ముందు చౌకాకారంలో నూరు మూరల ప్రమాణంలో ఒక దానికొకటి ఎదురుగా రెండు వేదికలను నిర్మించి వాటిపైన పంజరాలలో చిలుకలను తగిలించారు. ఐదు వందల మంది శిష్యులను ఒక్కొక్కరిని ఒకొక్క శాస్త్రంలో పరిణతులుగా తయారు చేశారు. ఆ గురువు తన శిష్యులను ఆనాలుగు ముఖాలు కలిగిన బ్రహ్మలాగా, వేయి నాలుకలున్న శేషునిలాగా, ఐదు ముఖములు కలిగిన రుద్రునిలాగా, ఆరు దర్శనాలు చదివిన షణ్ముఖునిలాగా, సముద్రాలను దాటగల సమర్థులుగా తన శిష్యులను తయారుచేశారు. లోపలి వైపు సేవకుల చేత బావులు, చెరువులను తవ్వించి వాటి ద్వారా పండించిన ఆహార ధాన్యాలు, కూరగాయలతో తమ శిష్యులకు ప్రతిరోజూ షడ్రసోపేతవాద అన్న భక్ష్యములతో సంతృప్తికరంగా భోజనం పెట్టేవారు.

(సశేషం)

# యోగవాసిష్ఠ కథాలహరి

డా॥ ధారారామనాధశాస్త్రి, ఒంగోలు

## జ్ఞానాదేవతు కైవల్యం

మానవ జీవితం ఒక ప్రస్థానం ఎక్కడ బయలుదేరి ఎక్కడ గడచి ఎక్కడ ముగిసి పోతుందో తెలీదు. అదికాక ఎవరికి ఎలాంటి జ్ఞానం సంక్రమిస్తుంది ? ఎలా సంక్రమిస్తుంది ? ఎప్పుడు ? ఎవరివల్ల ? మొదలైన అనేక ప్రశ్నార్థకాల సమాహారం జీవితం. ఇలాంటి జీవిత కథలు వ్యథలు ఎన్నో అధ్యయనం చేసి ఆయా జీవితగాథల వల్ల మనకి లభించిన ఒక నీతిని, అనుభూతిని ఆలకించుకొని సాధన చేస్తే తప్ప మార్గం లేదు. అంచేత పూర్వపూర్వ వ్యక్తుల జీవిత కథలు ఉత్తరోత్తర వ్యక్తుల శక్తియుక్తులు ప్రేరేపించి సన్మార్గమున నడిపించేవిగా ఉంటవి.

రామచంద్రా! పూర్వము మహా తపస్వి, తపస్సంపన్నుడు అయిన ఒక మునీశ్వరుడుండేవాడు. తాత తండ్రుల సంస్కారము అనువంశిక కృషి మొదలైన విషయాలు అతనికి పుట్టుకచేత సంక్రమించిన పెన్నిధులు కాగా అతడు జీవితంలో ఒక్క క్షణమైనా వృథా చేయకుండా నిరంతర నిర్నిద్ర సాధనా మార్గాన్ని అవలంభించి ఒక్కొక్కమెట్టు ఎక్కుతున్నాడు. ఏ మార్గాన్నీ కాదనలేదు. దేనినీ ఆక్షేపించలేదు. తనకి ప్రత్యేకంగా ఉన్న యోగ్యతాధికారాల వల్ల ఎక్కడా కప్పదాటు వేయలేదు. అతని పేరు వీతహవ్యుడు.

ఆలయ సోపానాలను కడగడం, పసుపు పూయడం, స్వామికి మాలికలల్లడం, అర్చన మొదలైన భాగమంతా చిత్తశుద్ధితో, దీక్షాదక్షతలతో కొన్నేళ్లు నిర్వహించేడు. ఫలితంగా మనస్సు ఎల్లప్పుడూ స్వామి మీద లగ్నం కావడమే కాక చేసే ప్రతిపనిలో ఒక సులువు, నేర్పరితనము లభించింది. అంటే బాగా కర్మచేయగా చేయగా ఒక కౌశలం సిద్ధించింది. అదోరకం యోగం. ఆపైన స్వామి కథలు వినడం, పాడడం, నలుగురికీ చెప్పడం నిరంతరం దానియందే మనసు నిలిపి స్వామి తత్త్వాన్ని అధ్యయనం చేయడం కార్యక్రమంగా కొన్నేళ్లు నడిపేడు. దీనితో హృదయ వికాసం సిద్ధించింది. అన్నిటా అణువణువునా ఆయన నిండివున్నాడు. ఆయన అంతర్యామి, సర్వేశ్వరుడు అన్న స్పృహతో వీతహవ్యుడు అటుపైన - రామప్రభూ - జాగ్రత్తగా జీవించాడు. ఇదంతా సరే! మరి నా సంగతేమిటి? నేనెవరిని ? అన్న జిజ్ఞాస ప్రారంభమైనది.

మనస్సును తీసుకొని వెళ్లి ఆత్మసంస్థంచేసి ఇంక దేన్ని గురించీ ఆలోచించకుండా కేవలానక్తితో ప్రవర్తించాడు. ఆ కేవలమైన ఆసక్తియే కైవల్యానికి మార్గంగా భాసించింది. కైవల్యమంటే మోక్షము కదా! అంటే విడుదల కదా! దేనినుండి?

ఇంద్రియ ప్రవృత్తుల నుండి విడుదల - ఘటం నుండి పటానికీ పటం నుండి శకటానికి పరుగెత్తుతూ వృక్షం మీద వానరంలాగ గెంతుతున్న చిత్త ప్రవృత్తుల నుండి విడుదల - కంటిముందు కనుపించే దృశ్యాలు, వాని మాయాస్థితి, దానిలోనే లగ్నమై జన్మలు జన్మలు వృథా అయిపోయే జీవిత విధానం నుండి విడుదల - ఇన్నిటి సమాహార స్వరూపమైన మోక్షపదవిని కేవలం జ్ఞానమార్గంలో వీతహవ్యుడు

➢ తరువాయి 21 వ పేజిలో.......

# మంచితనము

..... శింగల్‌రెడ్డి ఈశ్వరరెడ్డి
సెల్ : 9440426300

ప్రకృతిలో ప్రతిదీ రెండున్నాయి. చీకటి -వెలుగులు, రాత్రి-పగలు, మంచీ-చెడు, ఇలా... చీకటి ఉన్నపుడే వెలుగు విలువ తెలుస్తుంది. చెడ్డ అనుభవించినపుడే మంచి విలువ ఏమిటో తెలుస్తుంది.

**కొంచెపునరు సంగతిచే**

**అంతముగ కీడు వచ్చు అది ఎట్లన్నన్**

**కించిత్తునల్లికుట్టిన**

**మంచమునకు పెట్లువచ్చు మహిలో సుమతీ!** అని ఈ పద్యాన్ని శతాబ్దాల క్రితం బద్దెన కవి చెప్పాడు. అల్పుడైన వానితో కూడిన మంచివాడికే కాక ఈ సమాజానికే కీడు మూడుతుంది. హాయిగా నిద్రించే వాడి మంచంలో నల్లిచేరితే ఆ నల్లివల్ల మంచానికే దెబ్బలు తప్పవు. అట్లే అల్పుడు చేరిన సభ్యసమాజానికే ఒడిదుడుకులు కలుగుతాయి. అందుకే సమాజంలో అల్పులను చేరనీయరాదు.

అల్పుడంటే నీచుడు. దుర్మార్గుడు, దుష్టుడు. సమాజంలో ఎలాంటి వారుండాలి. మంచితనం, సన్మార్గం, శాంతం, మూర్తీభవించిన వారుండాలి. మంచివాడంటే తాను హాయిగా ఉంటూ ఇతరులు కూడా హాయిగా జీవించేందుకు సహకరించేవాడు. ఇతరులకు హాని తలపెట్టనివాడు. అలాంటివారితో సమాజానికి ఎలాంటి ఆపదరాదు. వారే మంచివారు. వారు నడిచే బాట మంచిబాట.

**మంచికాల మేగు దెంచిన రావచ్చు**

**తెల్లవారు దనుక తిరిగిరాకు**

**తిరిగివత్తులేని దెబ్బలు తప్పవు......** అన్నాడు శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారు. నాయనా ఇప్పటికాలం మంచిదికాదు. ఈ దుష్టకాలానికి దూరంగావుండు. మళ్లీ మంచికాల మొచ్చినపుడు నీవు రావచ్చు. అట్లని ముందుగా వస్తే దెబ్బలు తప్పవని హెచ్చరించారు.

అందుకే దుష్టులకు దూరంగా ఉండమన్నారు పెద్దలు. అది మనం గ్రహించాలి. ఏదో ఒకనాడు సమాజంలోని దౌష్ట్యం తొలగిపోయి మంచి కాలం రాకపోదు. అని మంచివానికి ఓదార్పు చెబుతున్నాడు. అట్లని దుష్టులను దుర్మార్గులను నిరసిస్తూ కూర్చున్నా సరిపోదు. మంచి వారు విజ్ఞతతో ప్రవర్తించాలి.

**పరుల దిట్టనోరు పాపపంకిల మౌను**

**పెద్దల నుతింప శుద్ధియగును**

**నోటి మంచితనము పాటించు సుజ్ఞాని...** అన్నాడు బ్రహ్మం గారు.

మంచి నడవడి కలిగినవారే జ్ఞానవంతులు. అలాంటి జ్ఞానం కలిగినవారు ఇతరులతో మంచిగానే నడుచుకుంటారు. అనవసరంగా ఎవరినీ కించపరచరు. ద్వేషించరు. మంచి మాటలతో ఇతరులను సంతోష పెట్టాలేగాని నొప్పించకూడదు. అలాంటివారే సుజ్ఞానులు. జ్ఞానంలేనివారు తమకు మేలు చేసినవారికి సైతం కీడు తలపెడతారు.

**అన్ని తిట్లు తిట్టి అజ్ఞాని దనుజుడౌ**

**తిట్లు మాని జ్ఞాని దేవుడగును**

**అరయ నిదియె జ్ఞాని సుజ్ఞానికి తేడా.** కాబట్టి జ్ఞానవంతుడు దేవునితో సమానమైతే ఇతరులను నిందించేవారు. దానవులవుతారు. మన స్నేహం కూడా ఎవరితో చేయాలో మనమే ఆలోచించుకోవాలి.

➢ తరువాయి 21 వ పేజిలో.......

గీతా సుధ

# భగవద్గీతకు భాసుర భాష్యం



డా॥ రాధశ్రీ, కర్నూలు, ఫోన్: 9494481210

(గత సంచిక తరువాయి)

**యస్మాన్నోద్విజతే లోకో లోకాన్నోద్విజతే చ యః ।**
**హర్షామర్షభయోద్వేగైః ముక్తో యః స చ మే ప్రియః (12-15)**

ఇది కూడా ఎంతో విలువైన మాట. మనం ఏ పని చేయాలన్నా మనసును సమతౌల్యంలో ఉంచుకోవాలి. మనం కష్టపెట్టాలనుకుంటూ ఉన్నప్పుడు, మనల్ని ఎవరైనా కష్టపెడుతున్నప్పుడు, సుఖానికి పొంగినప్పుడు, కష్టానికి క్రుంగినప్పుడు, భయంతో ఉన్నప్పుడూ, ఉద్వేగంతోవున్నప్పుడు మానసిక ప్రశాంతతను కోల్పోయి పనిలో తప్పులు చేస్తుంటాం. అందుకే మంచి, శాశ్వతమైన, నాణ్యమైన పని చేయాలంటే అన్నిటికన్న ముందు మనిషి ప్రశాంతంగా ఉండాలి. అప్పుడే మంచి పని చేయగలుగుతాడు. ఇంట్లో భార్యతో దెబ్బలాడి కోపంతో ఊగిపోతున్న ఒక ఎలక్ట్రీషియన్ కరెంటు పని చేస్తూ ప్లగ్గులో టెస్టరు పెట్టబోయి వేలుపెడితే ఏమవుతుంది ? కోపంతోనో భయంతోనే వణికిపోతున్న డాక్టరు కుడికన్నుకు వైద్యం చేసే బదులు బాగుగా వున్న ఎడమ కంటికి ఆపరేషన్‌చేస్తే ఏమవుతుంది ? పరమ కోపిష్టి అయిన బ్యాంకు ఆఫీసరు ఒక ఖాతాదారుడి ఖాతాలో జమచేయ వలసిన కోటి రూపాయలు మరో ఖాతాదారుడి ఖాతాలో జమ చేస్తే, ఆ వ్యక్తి ఆ సదరుకోటి రూపాయాలను బ్యాంకు నుండి "డ్రా" చేసుకుంటే ఏమవుతుంది ?... ఇవి కొన్ని ఉదాహరణలు... బస్సు డ్రైవర్లు, లారీడ్రైవర్లు, రైలు డ్రైవర్లు, విమానపు పైలట్లు ఒక్కక్షణం ఏమరుపాటుగా ఉన్న చాలు వందల వేల ప్రాణాలు పోవడానికి. అందుకే నల్లనయ్య మెల్లగా, చల్లగా, తేట తెల్లంగా "ప్రశాంతంగా ఉండే వాడే పనికి తగినవాడు" అంటూ ఎంతో వివేకవంతంగా వివరించాడు.

ఏ విధమైన దురాపేక్షలేనివాడు, పవిత్రుడు, దక్షుడు, వేదన లేనివాడు, దుఃఖము తొలగినవాడు, అనవసరమైన పనుల్లో వేలుపెట్టనివాడు నాకు (పనికి) ఇష్టుడు.

**అనపేక్షః శుచిర్దక్షః ఉదాసీనో గతవ్యథః ।**
**సర్వారంభపరిత్యాగీ యో మద్భక్తస్స మే ప్రియః ॥ 12-16 ॥**

సంతోషాన్నిగానీ, ద్వేషాన్నిగాని పట్టించుకోనివాడు కోరికలు లేనివాడు, దుఃఖించలేనివాడు, శుభాశుభాలను సమంగా చూచేవాడు, నాయందు భక్తి (పనియందు ధ్యాస) గలవాడు నాకు (పనికి) ప్రియమైనవాడు.

**యో న హృష్యతి న ద్వేష్టి న శోచతి న కాంక్షతి ।**
**శుభాశుభపరిత్యాగీ భక్తిమాన్ యస్స మే ప్రియః (12-17)**

శత్రువులయందు, మిత్రులయందు, మానావమానము యందు, శీతోష్ణాలల్లోనూ, ఒకే విధమైన సమభావం గలవాడు సర్వసంగ వివర్జితుడు. నాకు (పనికి) ఇష్టుడు.

**సమశ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః ।**
**శీతోష్ణసుఖదుఃఖేషు సమస్సంగ వివర్జితః (12-18)**

విమర్శించినా, ప్రశంసించినా మౌనం వహించేవాడు, సంతుష్టుడు ఏ ఒక్క విషయంలోనూ నివసించనివాడు (ఒకే విషయాన్ని పట్టుకొని లాగుతూ పీకుతూ కూర్చోనివాడు), స్థిరమతియైనవాడు, పని మీద ధ్యాసగలవాడును నాకు (పనికి) ఇష్టుడు.

**తుల్యనిందాస్తుతిర్మౌనీ సంతుష్టో యేన నకేనచిత్ ।**
**అనికేతః స్థిరమతిః భక్తిమాన్ మే ప్రియో నరః॥ (12-19**

ఎవరైతే నాచే (పనిచే) చెప్పబడిన ధర్మమతాన్ని గ్రోలుతారో, పూర్తిగా అభ్యసిస్తారో, శ్రద్ధతో, ధ్యాసతో, నిమగ్నతతో నేనే (పనినే) దేవుణ్ణని (దేవుడని) గ్రహిస్తారో వాళ్లు మాత్రమే నాకు అత్యంత ప్రియతములు, ప్రీతిపాత్రులు.

**యే తు ధర్మ్యామృతమిదం యథోక్త ం పర్యుపాసతే।**
**శ్రద్దధానా మత్పరమా భక్తాస్తే... తీవ మే ప్రియాః (12-20)**

ఈ అధ్యాయంలో ఒక్క శ్లోకం మాత్రమే అర్జునుడి అడిగినది. మిగిలిన 19 శ్లోకాలు భగవానుడు విపులంగా, వివరంగా, విస్తారంగా, విస్ఫారంగా విజ్ఞుల లక్షణాలను విశదీకరించినవే. ఇందులో చాల భావాలు పునరుక్తి (మళ్లీ మళ్లీ అవే చెప్పడం) అని కొందరికి అనిపించవచ్చు. కాని పరమ ధర్మాన్ని చెప్పేటప్పుడు ఒకటికి పదిసార్లు చెప్పినట్లైతే అది మనస్సులో నిలబడి ఉంటుంది అనే ఉద్దేశ్యంతో గీతాచార్యుడు చెప్పడం జరిగిందని భావించాడు. ఇదికూడా ఎంతో సహజమే. మన అందరికీ తెలిసిన విషయమే. బడిలో వెయ్యగానే అయ్యవారు ఓనమాలను, ఒంట్లను ఎక్కాలను పసితనంలోనే వందసార్లు వల్లెవేయిస్తారు. చెప్పిస్తారు, వ్రాయిస్తారు. రకరకాల బొమ్మలువేసి గుర్తుపట్టిస్తారు. అందుకే మనం చిన్నప్పుడు నేర్చుకున్న ఒంట్లు, ఎక్కాలు, సామెతలు, పద్యాలు, నీతికథలు మన మనస్సులలో ప్రింటవుతాయి. (అచ్చు గుద్దినట్లు నిలచిపోతాయి). ఇప్పటికీ కూడా పెద్ద పెద్ద మేనేజ్‌మెంటు క్లాసుల్లో ప్రొఫెసర్‌గారు ముందుగా తను చెప్పదలచుకున్న విషయాలను సూక్ష్మంగా (ముఖ్యాంశాలను) తెలిపి, మరలా ఆ విషయాలను విపులంగా చర్చించి, తిరిగి ముగించే సమయంలో మరోమారు ముఖ్యాంశాలను వివరిస్తారు. రోజూ మనం టీవీలో వార్తల్లో, ఎఫ్.యమ్. రేడియోలో వార్తల్లో ఈ పద్ధతినే చూస్తున్నాం. అంటే ప్రొఫెసరు రేడియోవాళ్లు, టీవీవాళ్లు అనుసరిస్తున్నది గీతామార్గమేనన్నమాట.

ఈ విధంగా మనం భక్తియోగంగా పేరుగొన్న 12వ అధ్యాయాన్ని సుసంపన్నం చేసుకున్నాం. సగుణాకారంగా గానీ, నిర్గుణంగాగానీ భగవంతుణ్ణి (పనిని) అర్థం చేసుకొని, ప్రణాళికాబద్ధంగా పనిచేసినట్లైతే ఆ భగవంతుడే ( ఆపనే) మనకు మోక్షాన్ని (ఆనందాన్ని) అందించే ప్రయత్నం జరుగుతుందనడంలో సందేహంలేదు. మన నిత్య జీవనంలో, సమాజంలో జరుగుతున్న మనకు అనుభవంలో వున్న ఎన్నో విషయాలతో అనుసంధానిస్తూ గీతకు చెబుతున్న సరిక్రొత్త కోష్యానికి, గీతాభిమానులు, కార్యోన్ముఖులు, భాషాసేవకులు, నవ నవోన్మేష భావుకులు ఎంతో స్పందిస్తూనన్ను ఉత్సాహ పరుస్తున్నారు. వారికి, కాలజ్ఞాన సుధ సంపాదకులకు, నిర్వాహకులకు, ప్రత్యేకించి అచలానందస్వామివారికి, పరిపూర్ణసిద్ధానందస్వామివారికి సహస్రాధిక నమస్సుమాంజలులు సమర్పించుకుంటున్నాను.

×××

తేది 29-8-2015వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మనప్రియతమ

ముఖ్యమంత్రి శ్రీ నారాచంద్రబాబు నాయుడు గారు ఈ భాష్యకారుడు (డా॥ రాధశ్రీ) గత ఎన్నో ఏండ్లుగా తెలుగు భాషకు చేసిన సేవలకు గుర్తింపుగా రు. 25,000/- నగదుతో అభినందన పత్రంతో, జ్ఞాపికతో, దుశ్శాలువతో సత్కరించడం జరిగిందని పాఠకులకు తెలియజేయడానికి సంతోషంగా ఉంది. ఇదంతా పాఠకుల అభిమానం. తెలుగు భామామ తల్లి కరుణగా రాధశ్రీ భావిస్తూ ఈ విజయాన్ని "తెలుగు తల్లి"కి ఆపాదిస్తున్నాడు.

+++

వచ్చే సంచిక నుండి 13వ అధ్యాయమైన క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగయోగాన్ని కృష్ణార్జున సంవాదరూపంలో అందునా ఆ భావాలు ఈనాటి సమాజరుగ్మతలను ఏ విధంగా తొలగిస్తాయో వివరణలతో సహా - విశ్లేషించుకుందాం. ఈ "క్షేత్రం" అనే పదానికి గీతకు ఎంతో సంబంధం వుంది. "ధర్మక్షేత్రే కురుక్షేత్రే" అన్నది మొదటి శ్లోకం. ఇక్కడ క్షేత్రం అంటే శరీరం (జన్మ) అనే అర్థంకూడా వుంది. అంటే ప్రతి క్షేత్రం (జన్మ) లోనూ ధర్మాన్ని ఆచరించడం (కురు-ధర్మం) అనే భావం చెబుతున్నది. క్షేత్రం అంటే శరీరమని క్షేత్రజ్ఞుడంటే ఆ భావాన్ని ఎరిగిన వాడని వివరించుకోవచ్చు. ఈ పదమూడవ అధ్యాయంలో గల 35 శ్లోకాలలోని కృష్ణార్జున సంభాషణను విపులంగా వచ్చే సంచిక నుండి విశ్లేషించుకుందాం.

---

➢ 17 వ పేజి తరువాయి ......

సంపాదించుకున్నాడు. ఎల్లకాలాల ఎల్లదేశాల సాధకులకి ఒజ్జబంతిగా నిలిచేడు

అలాంటి వానికి ఏ వైక్లబ్యము నిరాశ నిస్పృహ కలుగవు. జ్ఞానియై తత్త్వదర్శకుడై భాసిస్తాడు.

విచారిణం భవ్యపదం విశ్రాంతధియమాత్మని
సహరంతి వికల్పౌఘా జలౌఘ ఇవపర్వతమ్

విఘూతతా జలప్రవాహతా పర్వతాన్ని కదలించ జాలనట్లు విచారణాయుక్తుడు భవ్యపదమును పొందినవాడు, ఆత్మయందు విశ్రాంతి పొందిన బుద్ధికలవాడూ అయిన మానవుని శోకమోహాది వికల్ప సమూహాలు ఏమీ చేయలేవు. రామా! నీవుకూడా ఆ పర్వతంలాగ నిలబడాలి.

---

➢ 18 వ పేజి తరువాయి ......

**పరుసవేది వలన బంగారమగు నిన్ము**
**గురుని వలన శిష్యవరుడు వెలుగు**
**మంచి సాహచర్య మెంచి చూచుట మేలు....** అన్నారు స్వామీజీ.

ఇనుముతో కూడిన అగ్నికి సమ్మెట పోట్లు తప్పనట్లు అల్పబుద్ధివారితో స్నేహం చేస్తే ఇక్కట్లు కలుగవచ్చు. కావున మంచివారితో స్నేహం చెయ్యాలి.

**మాటకేమి ఫలము మనసు నిల్పఫలము**
**మనసునిల్ప తేట మాటదొరుకు**
**తేటమాట దొరుకదేవతామూర్తియౌ...**

సర్వజీవకోటికి, మానవునికి తేడావుంది. మనిషి మాట్లాడగలుగుతాడు. ఆలోచించగలడు. మంచి, చెడు తెలుసుకోగలడు. ఈ ప్రపంచంలో మనిషి తప్ప ఏ జీవి మాట్లాడలేదు. ఆ మనిషి తన మనస్సును స్వాధీనంలో ఉంచుకొని నిలిపితే ఎంతటి మహత్కార్యాన్నైనా సాధించుకోగలడు.

మన ఉపనిషత్తులుకూడా ఇటువంటి మంచి మాటలనే బోధిస్తున్నాయి. "సర్వేజనాసుఖినోభవన్తు" అన్నారు. సర్వేసంతు విరామయాః ఎవరు దుఃఖభాగులు కాకుండా జీవించాలని దీని అర్థం. మంచిమాట ఎవరు చెప్పినా, ఆచరించినా మహాభాగ్యంగా స్వీకరించాలి. తద్వారా మన బ్రతుకుల్ని పండించుకోవాలి. □

# మహాభారతంలోని నీతి కథలు

.. డాక్టర్ కె. సత్యనారాయణ
సెల్: 9440732210

### గజకచ్ఛప వృత్తాంతం

కామక్రోధలోభమోహమదమాశ్చర్యాలనే అరిషడ్వర్గాలను జయించలేని మానవుడు పరమపదాన్ని చేరుకోలేడని విజ్ఞులంటారు. కామము, క్రోధము వలె లోభము కూడా మనిషిని అనేక కష్టాల పాలు చేస్తుంది. ఒకే తల్లి కడుపున పుట్టిన అన్నదమ్ములైనా ఈ లోభ గుణం వల్ల పరమశత్రువులుగా మారిన ఉదాహరణలు కోకొల్లలుగా కనిపిస్తాయి. అలాంటి ఉదాహరణే మహాభారతం ఆదిపర్వంలోని గజకచ్ఛపవృత్తాంతం.

పూర్వం విభావసుడు అనే ఒక ఋషి ఉండేవాడు. అతడు ముక్కోపి. కాని అతని తమ్ముడు సుప్రతీకుడు మాత్రం వినయ సంపన్నుడు. ఒకరోజు తమ్ముడు అన్న వద్దకు వెళ్లి తల్లిదండ్రులు ఇచ్చి వెళ్లిన ఆస్తిని పంచి ఇవ్వమని అడుగుతాడు. అలా పంచి ఇవ్వడం ఇష్టంలేని విభావసుడు తన తమ్ముడితో "సుప్రతీకా! ధన లోభం అన్నిటికంటే చెడ్డది. దీనివల్లనే లోకులు పంపకాలు కోరుకుంటారు. పంపకాలు పూర్తి అయిన వెంటనే శత్రుత్వం పెరుగుతుంది శత్రువులు కూడ వీరి పరిస్థితిని గమనించి మిత్రులుగా నటించి ఇరువురిలో మరింత ద్వేషభావాన్ని పెంచుతారు. ఈ శత్రుత్వభావం వల్ల ఇరువురూ అధఃపాతాళానికి పడిపోతారు. కనుకనే సత్పురుషులు అన్నదమ్ములు ఎప్పటికీ వేరుపడకూడదంటారు. పెద్దల మాటను, శాస్త్రాల మాటను లెక్కచేయనివాడు తగిన ఫలితం అనుభవిస్తార"ని అంటూ నీవు ఈ భేదబుద్ధి చేతనే ఆస్తి పంచమని అడుగుతున్నావు కనుక "ఏనుగువై పుట్టు" అని శాపం ఇస్తాడు. ఈ శాపానికి కృద్ధుడైనత మ్ముడు కూడా నేను ఏనుగునైతే నీవు తాబేలు కమ్మని ప్రతిశాపమిస్తాడు.

ఏనుగు ఆరు యోజనాల ఎత్తు, పన్నెండు యోజనాల పొడుగు ఉండగా, తాబేలు మూడు యోజనాల పొడవు, పది యోజనాల వృత్తం కలిగి ఉంటుంది. ఈ రెండూ పరస్పర ద్వేషంతో అహోరాత్రులూ ఒకదానిమీద మరొకటి పైచేయి సాధించాలని ప్రయత్నిస్తూనే ఉన్నాయి. ఇలా ఉండగా గరుత్మంతుడు తన తల్లి కోసం అమృతం తీసుకురావడానికి బయలుదేరుతాడు. కాని అతనికి అమరావతిని చేరి అమృతం తేవడానికి కావలసిన శక్తిలేదు. ఆ సమయంలో గరుత్మంతుని తండ్రి కశ్యప ప్రజాపతి గజకచ్ఛపుల పూర్వ చరిత్రను వివరించి ఎంతో బలిష్ఠమైన ఆ జంతువులను తిని శక్తిని సంపాదించి అమృతాన్ని తెమ్మని ఆజ్ఞాపిస్తాడు.

కశ్యపుని అనుమతి తీసుకుని గరుత్మంతుడు ఆ సరోవరానికి వెళ్లి ఒక కాలితో ఏనుగును, మరో కాలితో తాబేలును పట్టుకుని ఆకాశంలో చాలా దూరం ప్రయాణం చేసి ఆలంబతీర్థం దాటి గంధమాదన పర్వతంచేరి ఈ గజకచ్ఛపాలను ఆరగిస్తాడు.

ఈ విధంగా లోభగుణం అన్నదమ్ములను పరమ శత్రువులుగా మార్చి వేయగలదని దానిని ఎంత మేరకు అవసరమో అంతమేరకే అదుపులో ఉంచుకోవాలని ఈ కథద్వారా తెలుస్తోంది.

# రఘువంశం



మహాకవి కాళిదాసు
కృతికి భావానువాదం:
డా॥ సముద్రాల లక్ష్మణయ్య,
తిరుపతి

(గత సంచిక తరువాయి)

**అజుని పట్టాభిషేకం**

పిమ్మట రఘుమహారాజు ఇంకా వైవాహిక కౌతుకం వదలని అజుడికి మరొక ఇందుమతిని సమకూర్చాడా అన్నట్లు రాజ్యలక్ష్మినిగూడా సమర్పించాడు. సాధారణంగా రాజపుత్రులు ఎన్ని దుష్కృతాలైనా చేసి రాజ్యాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రయత్నిస్తారు. కాని అప్రయత్నంగా లభించిన ఆ రాజ్యాన్ని అజుడు తండ్రి ఆనతి అన్న భావంతో స్వీకరించాడే కాని భోగతృష్ణతో పరిగ్రహించలేదు. వసిష్ఠ మహర్షి పోసిన జలాలతో అజునితో పాటు అభిషేకింపబడ్డ భూకాంత విశదమైన ఉచ్ఛ్వాసంద్వారా (తెల్లటి ఆవిరి ద్వారా) తన కృతార్థతను ప్రకటించిందా అన్నట్లయింది.

అథర్వవేదాభిజ్ఞుడైన వసిష్ఠమహర్షి అజుడికి అభిషేక సంస్కారం నిర్వర్తించాడు. ఆ తేజోమహిమవల్ల అరివీరు లతనిని తేరిపార జూడలేకపోయారు. బ్రహ్మక్షత్ర తేజస్సుల కలయిక పవనాగ్నుల కలయిక వంటిదిగదా! నూతనంగా పట్టాభిషిక్తుడైన అజుణ్ణి ప్రజలు మళ్ళీ యౌవనం పొందిన రఘుమహారాజే అని భావించారు. తండ్రినుంచి రాజ్యసంపదను మాత్రమే కాక అతడు గుణాల నన్నింటినీ పుణికి పుచ్చుకొన్నాడు. జనకుని నుండి సంక్రమించిన రాజ్యం అజుని వల్లా, అజుని నవయౌవనం వినయంవల్లా - ఇలా ఈ రెంటివల్లా ఆ రెండూ ఎంతగానో శోభిల్లాయి. అప్పుడే చేతికి వచ్చిన రాజ్యరమను బలాత్కరిస్తే ఉద్వేగం పొందుతుందని ఆ మహాభుజుడు నవవధువు ననుభవించినట్లు మృదువుగా అనుభవించాడు.

తన చెంతకు వచ్చే వందలకొలది నదుల్లో ఏ నదినీ సముద్రుడు అవమానించడు. అలాగే అజమహారాజు తన రాజ్యంలో ఎవరినీ తిరస్కరించలేదు. అందువల్ల ప్రజలలో ప్రతివాడూ 'ఈ రాజుకు నేనంటేనే ఇష్టం' అని భావించేవారు. అతడు పరిపాలనలో మరీ కఠినంగానూ, మరీ మెత్తగానూ ప్రవర్తించలేదు. మధ్యమ పద్ధతి నవలంబించి గాలి చెట్లను పెళ్ళగించకుండానే వంచినట్లు విరోధులను నిర్మూలించకనే లోగొనేవాడు. సత్త్వబలంతో పుత్రుడు ప్రజల్లో దృఢంగా పాతుకోవడం రఘుమహారాజు గమనించాడు. ఇక లౌకిక సుఖాలపైనే కాక అశాశ్వతాలైన స్వర్గసుఖాలపైకూడా ఆయనకు కోరిక లేకుండా పోయింది.

దిలీపుని వంశంలోని వారందరూ వర్ధకంలో గుణవంతులైన కుమారులకు రాజ్య మప్పగించి నియమవంతులై నారచీరలు దాల్చిన మౌనుల మార్గాన్నే అనుసరించేవారు. రఘుమహారాజు ఆ పద్ధతిలోనే నడవాలనుకొన్నాడు. అడవికి వెళ్ళడానికి సిద్ధమవుతున్న తండ్రి పాదాలకు ఉష్ణీషంతో ఒప్పారే శిరస్సుతో ప్రణమిల్లి అజుడు తన్ను వదలిపోవద్దని ప్రార్థించాడు. కంట తడిపెట్టిన కుమారుని కోరికను పుత్ర ప్రీతిగల తండ్రి కాదనలేకపోయాడు. కాని విడిచిన కుబుసాన్నిపాము తిరిగి ధరించనట్లు వదలిన సిరిని మాత్రం అతడు మళ్ళీ తన దరికి చేరనీయలేదు. ఆ రఘుమహారాజు సన్యాసం స్వీకరించి నగరానికి

వెలుపల నివసించాడు. కుమారుడనుభవిస్తున్న రాజ్యలక్ష్మి ఆ మహామహునికి కోడలులాగా శుశ్రూష చేసింది.

ముందటిరాజు ప్రశాంతస్థితిలో వున్నాడు. క్రొత్తరాజు అభ్యుదయ పథంలో పురోగమిస్తున్నాడు. అప్పుడారాజకులం అస్తమించే చంద్రుడూ, ఉదయించే సూర్యుడూ కల అంబరంతో సామ్యం వహించింది. రఘువు కాషాయాదులనూ, అజుడు ఛత్రచామరాదులనూ ధరించారు. నివర్తకమైన మోక్షధర్మమూ, ప్రవర్తకమైన అభ్యుదయ ధర్మమూ అలా తమతమ అంశాలలో అవనీమండలంలో అవతరించాయా అన్నట్లు ప్రజలు వారిరువురినీ చూచారు. అజుడు ఓటమిలేని పదవి నధిష్ఠించడానికై మంత్రులతో కూడాడు. రఘువు మోక్షప్రాప్తికై ఆప్తులైన యోగులతో చేరాడు. తరుణ నృపతి ప్రజాపరిరక్షణకై ధర్మాసనం అధిష్ఠించాడు. వృద్ధనృపతి చిత్తైకాగ్రతకై ఏకాంతంలో దర్భాసనం స్వీకరించాడు. ఒకడు ప్రక్కరాజులను ప్రభుశక్తితో స్వాధీనం చేసుకొన్నాడు. మరొకడు సమాధి యోగంతో శరీరంలోని ప్రాణాది పంచవాయువులను వశపరచుకొన్నాడు.

అజుడు శత్రువుల ప్రయత్నాలను ఫలితాలతో సహా బుగ్గిచేశాడు. రఘువు జ్ఞానాగ్నితో తన కర్మలను భస్మీకరించటానికి ఉద్యుక్తుడయ్యాడు. రాఘువుడు ఫలవంతా లయ్యేటట్లుగా ఆలోచించి సంధి మొదలైన షడ్గుణాలను ప్రయోగించాడు. మట్టినీ, బంగారాన్నీ తుల్యంగా భావించే రఘువు సత్త్వాది త్రిగుణాలను వికారానికి లోనుగాకుండా నిగ్రహించాడు. కర్మనిష్ఠుడైన నూతన ప్రభువు ఫలసిద్ధి కలిగే వరకూ కర్మనుండి విరమించలేదు. స్థిరబుద్ధి అయిన వృద్ధభూపతి పరమాత్మ సాక్షాత్కరించేవరకూ యోగానుసంధానం వదలలేదు. ఇలా జాగరూకుడై శత్రువుల నరికట్టి అజుడు అభ్యుదయ రూపమైన సిద్ధిని పొందాడు. అప్రమత్తుడై ఇంద్రియాలను నిగ్రహించి రఘువు మోక్షరూపమైన ఫలాన్ని చూరగొన్నాడు.

సమదృష్టి సంపన్నుడైన రఘుమహారాజు అజుని కోరికమేరకు కొన్ని సంవత్సరాలు అక్కడే గడిపాడు. ఆపై యోగసమాధితో మాయ కతీతుడైన పరమాత్మను చేరుకొన్నాడు. తండ్రి దేహత్యాగం చేశాడని విని అజుడు చిరకాలం కన్నీరు కార్చాడు. పరివ్రాజకులతో కూడి తండ్రికి అగ్ని సంస్కార రహితమైన అంత్యకర్మ నిర్వర్తించాడు. శ్రాద్ధవిధిని చక్కగా గ్రహించిన అజమహారాజు కేవలం పితృభక్తితోనే జనకుని శ్రాద్ధకర్మ అనుష్ఠించాడు. యోగమార్గంలో శరీరం త్యజించినవారు తనయులిచ్చే పిండాన్ని కోరరుగదా!

"మీ తండ్రి ముక్తిపొందాడు, అతనికై శోకింపవద్దు" అన్న తత్త్వజ్ఞుల ఉపదేశంతో క్రమంగా అజుని మనోవ్యథ శాంతించింది. అతడు ధనువు చేపట్టి ఏమాత్రం ఎదురులేకుండా రాజ్యపాలన కొనసాగించాడు.

మహాపరాక్రమశాలి అయిన అజమహారాజుకు క్షితి, ఇందుమతి అనే ఇరువురూ దేవేరు లయ్యారు. వారిలో క్షితి అనేక రత్నాలను ప్రసవించగా, ఇందుమతి వీరుడైన కుమారుణ్ణి కనింది. ఆ యిందుమతీ సుతుడే సూర్యసమతేజుడూ, దశదిశలా యశముగావించిన వాడూ, రామచంద్రుని జనకుడూ అయిన దశరథ మహారాజుగా తరువాత ప్రశస్తి వహించాడు.

అధ్యయనంతో ఋషిఋణాన్నీ, యజ్ఞాలతో దేవఋణాన్నీ, సంతానంతో పితౄణాన్నీ తీర్చుకొని అజుడు పరివేష విముక్తుడైన భానునిలా భాసించాడు. అతని బలం ఆర్తుల భయాన్ని తొలగించడానికీ, చదువు

విద్వాంసుల సత్కారానికి వినియోగపడింది. అలా ఆ నరపాలుని ధనమే కాక గుణంకూడా పరుల కెంతగానో ఉపకరించింది.

ప్రజారక్షణలో ఏమాత్రం ఏమరుపాటు చూపని ఆ భూపాలుడు ఒకనాడు ఇందుమతితో పాటు నగరోద్యానంలో శచీసమేతుడై నందనవనంలో విహరించే దేవేంద్రునిలాగ వాహ్యాళి సలుపసాగాడు. దక్షిణసాగర తీరంలోని గోకర్ణ క్షేత్రాన్ని అధిష్టించి వున్న పరమ శివుని చెంత వీణాగానం చేయడానికై నారదుడు అదే సమయంలో ఆకాశమార్గాన పయనించాడు. ఆ దేవముని వీణాశిరస్సునందు అలంకరించివున్న దివ్యకుసుమమాల పరిమళాలు విరజిమ్ముతూ వున్నది. ఆ వాసన మీది అభిలాషతో కాబోలు అమితవేగంగా వీస్తూ వచ్చిన గాలి ఆ విరిదండను కాస్తా అపహరించుకో పోయింది. ఆ పువ్వుల వెంట పయనిస్తున్న తుమ్మెదలు వీణను వదలి తామూ క్రిందికి దిగాయి. పవనుని అధిక్షేపానికి గురి అయిన వీణ కాటుకతో కలుషితమైన కన్నీరు కారుస్తున్నదో అన్నట్లు ఆ తుమ్మెదలబారు అగుపించింది.

**ఇందుమతి మరణం**

ఆ దివ్యమాల మకరందంతోనూ, సౌరభంతోనూ నేలమీది తీగల మధుగంధసంపదను పరాభవిస్తూ దిగివచ్చి ఇందుమతీదేవి చనుమొనలపై వ్రాలింది. అలా క్షణకాలం అందమైన తన స్తనాలతో చెలిమిచేసిన ఆ మాలను చూడగానే ఇందుమతి వివశురాలై రాహువు గ్రసించిన చంద్రుని వెన్నెలలాగా అసువులు బాసింది. ఇంద్రియ శూన్యమైన శరీరంతో నేల వ్రాలుతూ ఆమె తనతోపాటు తన భర్తను గూడ నేల వ్రాల్చింది. దీపజ్వాల తైలబిందువును వదలి తానొక్కటే నేలపై జారిపడదుగదా!

అపుడా దంపతుల పరిజనులు దుఃఖార్తులై బిగ్గరగా ఆక్రందనం చేశారు. ఆ ధ్వనికి కలవరపడిన అక్కడి మడుగులోని పక్షులు తామూ వారి ఖేదంలో పాలుపంచుకొన్నవా అన్నట్లు ఆక్రోశించాయి. అజుడు వీజనాది పరిచర్యలవల్ల మూర్ఛనుండి తేరుకొన్నాడు. కాని ఇందుమతి మాత్రం అలాగే వుండిపోయింది. ఆయుస్సు మిగిలి వుంటేగదా చికిత్స ఫలించేది! అసువులు వీడడంవల్ల తంత్రులు తెగిన వీణలాగా మూగవోయిన ఇందుమతిని ప్రేమమూర్తి అయిన అజుడు ఒడిలోకి తీసుకొన్నాడు. ఇంద్రియాలు తొలగిపోవడంవల్ల కాంతి గోల్పడిన కాంతను తొడపై నిడుకొన్న అజుడు ఉషఃకాలంలో మలినమైన మృగరేఖను దాల్చిన చంద్రునిలా కనిపించాడు.

- దృశ్యపదార్థములందెంత ఆసక్తి తగ్గుచుండునో దేవుని యందు అంత భక్తి వృద్ధియగు చుండును.
- శ్రీ గురుదేవుని అహర్నిశము సేవిస్తూ వారియొక్క అనుగ్రహమును పొంది ఇహపర ముక్తిని పొందుము.
- నీ దేహము మాంసపిండమని గ్రహించిన రోజు నుండే అసలు నీవెవరో తెలియడం ప్రారంభమవుతుంది.
- భోగాలు పెరిగినపుడు నరులు రోగాల పాలుకాక తప్పదు.
- సద్గురువును త్రికాలముల యందు పూజించెడి వారికి మరు జన్మలేదు.

# మహాదాత కర్ణుడు

బ్రహ్మశ్రీ బొడ్డు పల్లి పవన్‌కుమార్ అవధాని, సెల్ : 8520975415

అది మహాభారతం నాటి కాలం పదిరోజులుగా కుండపోతగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపిలేకుండా వానలు కురియడం వల్ల వాగులూ, వంకలూ ఏరులైపారుతున్నాయి గ్రామాలు, నగరాలన్నీ జలమయమయ్యాయి. ఎటువైపు చూసినా చిత్తడి! చిత్తడి! ఆకాశానికి చిల్లి పడ్డదా ? అన్నట్లుగా వుంది

పదిహేనురోజులకు ముందే ఒక విప్రుడు విశ్వకల్యాణార్థమై యాగం చేయ సంకల్పించుకుని యాగానికి కావాల్సిన సంబరాలన్నీ సమకూర్చుకుని ముహూర్తం కొరకై ఎదురుచూస్తున్నాడు. ఊహించనివిధంగా ఈ పదిరోజుల నుండీ ఎడనెడలేకుండా కురిసిన వానలవల్ల ఎండు కట్టెలు దొరకడమే మిక్కిలి దుర్లభమయ్యింది. బ్రాహ్మణోత్తముడు విచారవదనుడై ఎండు కట్టెలు ఎలా దొరుకుతాయి ? ఎవరిని ఆశ్రయించాలి. అనుకుంటూవుండగా, ఎందుకో విచారం ? మన హస్తినాపురి మహారాజు దుర్యోధనుల వారుండగా ? వారినే ఆశ్రయించండి అన్నది బ్రాహ్మణుని ధర్మపత్ని.

ఇల్లాలు చెప్పిందే తడవుగా బ్రాహ్మణోత్తముడు గాంధారేయుడు సుయోధనుడిని సమీపించి తన సంకల్పాన్ని విన్నవించి యాగార్థమై రెండు ఎడ్ల బండ్ల నిండా ఎండు కట్టెలు కావాల్సిందిగా కోరాడు. కురు ప్రభువు తన భటుల్ని పిలిచి, ఆ బ్రాహ్మణోత్తముని యాగ నిర్వాహణకు కావాల్సిన ఎండు కట్టెలు మన వద్దవున్నాయో? లేవో ? పోయి చూసిరమ్మనగా వెంటనే భటులు తరలి వెళ్ళి ఆ పరిసరాలన్నీ తిరిగి వచ్చి ఎండు కట్టె మోపులు ఎక్కడాలేవు మహారాజా! అని విన్నవించుకున్నారు. విన్నారుకదా! విప్రోత్తమా! ఈ జడివానలకు ఎండు కట్టెలు ఎక్కడా దొరకవు. మీరు మీ యాగాన్ని వాయిదా వేసుకొని పది దినాలు ఆగిరండి! కావల్సినన్ని కట్టెమోపులు తీసుకుపొండి! అని పలికాడు కురునందనుడు.

విప్రోత్తముడు మారుమాట్లాడలేక వెనుదిరిగి వస్తూ అంగరాజు కర్ణుడిని మహాదాత అంటుంది లోకం. వారిని ఆశ్రయించి చూద్దాం! అనుకుని దానవీరశూర కర్ణుడిని సమీపించి విషయం వివరించి చెప్పాడు. కర్ణుడు కొంత తడవుగా ఆలోచించి భటులను పిలిచి మన రాచనగరంలోని మట్టి మిద్దెలు రెంటిని పగులకొట్టి అందులోని దూలాలు, దంతెలు చీల్చి, ముక్కలు చేసి, బండ్లకెత్తుకొని యాగశాలకు చేర్చిరండని ఆజ్ఞాపించాడు. అంగరాజు చెప్పిందే తడవుగా 25 మంది భటులు రెండుమట్టి మిద్దెలు పగులకొట్టి వాని దూలాలు దంతెలు చీల్చి ముక్కలు చేసి, రెండు ఎడ్లబండ్ల కెత్తించి బ్రాహ్మణోత్తముని వెంట యాగశాలకు తీసుకొని పోసాగారు. హస్తినా రాజ వీధిలో నుండి ఎండు కట్టెలతో బారులుగా తరలిపోతున్న ఎడ్లబండ్లను అంతఃపుర మహల్‌పై నుండి చూసిన సుయోధన రారాజు భటులను పిలిచి అక్కడికిపోయి ఆ కట్టెలు గల బండ్లు ఎచటికి పోతున్నాయో తెలుసుకొని రమ్మన్నాడు. భటులు వెడలి తిరిగివచ్చి నరవరా! కురువరా! బ్రాహ్మణోత్తముని యాగార్థం రాధేయుడు కర్ణుడు మిద్దెలు పగలుగొట్టించి దంతెలు, దూలాలు పంపిస్తున్నారు అని వివరించారు.

వారెవ్వా! షహబాసు మిత్రమా కర్ణా! షహబాసు. అక్కటా! మహీపాలుడనైన నేను యాగానికి ఎండు కట్టెలు ఇవ్వలేకపోతిని. కాని నీవు ఇంతటి వర్షంలో మిద్దెలు పగులకొట్టి ఎండు కట్టెలిచ్చావు. బాపురె! నిక్కంగా నీవేదాన కర్ణుడివయ్యా! హితుడా! వీరునిగా, ధీరునిగా, శూరునిగా మహాదాతగా నీ జన్మ సార్థకం చేసుకున్నావు అంటూ అంగరాజ్య భూపాలుడిని తదేకంగా పొగిడాడు దుర్యోదన సార్వభౌముడు.

అలా కర్ణుడు తన దాతృత్వంతో నానాటికీ దాన కర్ణునిగా, జగద్విఖ్యాతినొంది, విశ్వవిఖ్యాతుడయ్యాడు.



# కాశీ క్షేత్రం



గోనుగుంట మురళీకృష్ణ, సెల్ : 9701260448

**"జయ జయ దేవ హరే! అమల కమల దళలోచనా! భవ మోచనా! త్రిభువన భవన నిదానా! జయ జయ దేవహరే!"**

అని హరినామస్మరణ చేస్తూ పారవశ్యంతో అరమోడ్పు కనులతో మబ్బులలో తేలి వస్తున్నాడు దేవముని నారదుడు. ఆయనకి కలహ ప్రియుడు అని పేరు. కానీ ఆ కలహాలు లోక కల్యాణానికే దారితీస్తాయి. అందువల్ల ఆయన ఏ లోకానికి వెళ్ళినా పూజలందుకుంటూనే ఉంటాడు. దేవతలు, రాక్షసులు పరస్పరం విరోధులు కావచ్చు. కానీ నారదుడి విషయంలో వారిది ఏకాభిప్రాయం. ఆయన కనిపించగానే నమస్కరిస్తారు.

ప్రస్తుతం శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడనే పేరుతో భూలోకంలో అవతరించి ఉన్నాడు. అక్కడ ప్రజలంతా ఎటువంటి ఈతి బాధలు లేక సుఖశాంతులతో ఉన్నారు. శ్రీకృష్ణదర్శనం కోసం భూలోకానికి బయలుదేరాడు నారద మహర్షి. గగన తలం దాటి వచ్చి, కొండలు గుట్టలు దాటుకుని ద్వారకా నగరం ప్రవేశించాడు నారదుడు.

నగర వీధులలో సాంబుడు స్నేహితులతో ఆడుకుంటున్నాడు. శ్రీకృష్ణుడు, జాంబవతిల కుమారుడు సాంబుడు. పదహారేండ్ల వాడు. దూరం నుంచే నారదుడి రాకను గమనించి పిల్లలంతా ఎదురువెళ్ళి "నమస్కారం మునీంద్రా!" అని చేతులు జోడించారు. ''దీర్ఘాయురస్తు! అని దీవించాడు నారదుడు. కానీ సాంబుడు మాత్రం నారదుడి రాక గమనించలేదు. తన ఆటలలో తాను మునిగిపోయాడు.

అది చూడగానే మునికి ఆగ్రహం వచ్చింది ఎలాగైనా అతడికి బుద్ధిచెప్పాలనుకున్నాడు. ఒక్కక్షణం ఆలోచించి యమునా నదీ తీరానికి వెళ్ళాడు. అక్కడ జపం చేసే మిషతో కొంతసేపు ఆగిపోయాడు.

సూర్యాస్తమయం అయింది. శ్రీకృష్ణుడు తన భార్యలతో ఏకాంతంగా గడిపే సమయం ఆసన్నమైంది. ఆ సమయం చూసుకుని కృష్ణ దర్శనం కోసం బయలుదేరాడు నారదుడు.

ఆ సమయంలో శ్రీకృష్ణుడు జాంబవతితో సరససల్లాపాల్లో ఉన్నాడు. నారదుడి ఆగమనం చూసి మందిరం బయటే ఎదురు వెళ్ళి స్వాగతం చెప్పాడు సాంబుడు.

''నేను వెంటనే కృష్ణ దర్శనం చేసుకోవాలి. నేను వచ్చినట్లు తెలియజేయి'' అన్నాడు.

''క్షమించండి స్వామీ! ఈ సమయంలో తండ్రిగారు మా తల్లితో కలసి ఏకాంతంగా ఉన్నారు. ఇప్పుడు నేను వెళ్ళి ఏకాంత భంగం చేయలేను'' అన్నాడు సాంబుడు.

''మహర్షిని, నిరంతర హరినామ కందళిత హృదయార విందుడను. నాకే ఎదురు చెపుతావా? నాకు ఆగ్రహం తెప్పించి నా శాపానికి గురికావద్దు. వెళ్ళు'' అన్నాడు నారదుడు.

సాంబుడు ఒక్కక్షణం నిస్సహాయంగా చూసి మౌనంగా అంతఃపురంలో ప్రవేశించాడు. వేళకాని వేళలో వచ్చిన అతడిని చూడగానే శ్రీకృష్ణుడికి ఆగ్రహం

వచ్చింది.

"సాంబా! లోనికి ఎవరూ రాకూడదని చెప్పాను కదా! నా ఆజ్ఞని ఎందుకు అతిక్రమించావు ? ఈ అనుచిత ప్రవర్తనకు ఫలితం అనుభవించు. ఈనాటి నుండీ నీవు కుష్టువ్యాధి పీడితుడవు అవుగాక!" అని శపించాడు.

"తండ్రీ! నన్ను క్షమించండి!! అని పాదాల మీద పడ్డాడు సాంబుడు.

నారదుడు వచ్చి కృష్ణుడిని దర్శించుకుని పరిపరివిధాల స్తోత్రం చేసి వెళ్ళిపోయాడు. కొంత సేపటికి కృష్ణుడి ఆగ్రహం చల్లారిపోయింది.

"అమ్మా! నారద మహర్షి వెంటనే తండ్రిగారి దర్శనం కావాలని పట్టుబట్టారు. ఇది సమయంకాదని ఎంతవారించినా వినలేదు. అందువల్ల తప్పనిసరై లోపలికి రావలసి వచ్చింది" అన్నాడు సాంబుడు తల్లితో.

అయ్య కోపిస్తే అమ్మ ఆదరిస్తుంది అన్నట్లు జాంబవతికి కుమారుడిని చూసి ఎంతో బాధ కలిగింది. "స్వామీ! నారద మహర్షి కారణం వల్లనే మన కుమారుడు లోపలికి రావలసి వచ్చింది. ఇందులో అతని దోషమేమున్నది ? అదీకాక తల్లిదండ్రులను చూడటానికి కన్నబిడ్డకు అనుమతి కావాలా ? కనికరించి శాపవిమోచనమైనా ప్రసాదించండి" అని ప్రార్థించింది.

"ఆగ్రహావేశాలు విచక్షణా జ్ఞానాన్ని హరిస్తాయి దేవీ! సరే! సాంబా! పుణ్యక్షేత్రమైన కాశీకి వెళ్ళి సూర్యభగవానుడిని ఆరాధించు. శాపవిముక్తి కలుగుతుంది"అన్నాడు శ్రీకృష్ణుడు.

సాంబుడు తల్లిదండ్రులకు మొక్కివెళ్ళిపోయాడు. శాపఫలితంగా అతణ్ణి కుష్టువ్యాధి కబళించింది. ఆ మర్నాడు సాంబుడు అక్రూరుడి ఆశ్రమానికి వెళ్ళాడు. అక్రూరుడు అతడికి ఉచిత మర్యాదలు చేశాడు.

"అక్రూర మహాశయా! చూశారా నా దురావస్థ ? " అన్నాడు కన్నీళ్ళతో.

"విచారించకు నాయనా! ఎంతటి వారికైనా కర్మానుభవం తప్పదు. నీ కర్మ నశించగానే నీకూ మంచిరోజులు వస్తాయి."

"స్వామీ! ఆ కాశీక్షేత్రం ఎలాంటిది ? దాని ప్రాశస్త్యం ఏమిటి ? కాశీ క్షేత్ర మహాత్మ్యం గురించి నాకు వివరించవలసినదిగా ప్రార్థిస్తున్నాను"

"తప్పకుండా వివరిస్తాను. పరమేశ్వరుడు విశ్వేశ్వరుడిగా, పార్వతీదేవి విశాలాక్షిగా వెలసిన పుణ్యక్షేత్రం కాశీ. దీనికే వారణాసి అని మరోపేరు. కాశీలో ఎన్నో తీర్థాలు, ఆలయాలు ఉన్నాయి. శిరసున ఉండే శ్రీశైలక్షేత్రం మల్లికార్జున స్వామి నిలయం. ఫాలభాగంలో చల్లని మంచువంటిదీ, నిర్మలము అయిన కేదార తీర్థం ఉన్నది. నడిమి భాగాన ఆనంద వన తీర్థం. అధివసించి ఉంటుంది. దిగువ భాగంలో ఉన్నది గంగ. ఈ మహాతీర్థాలు పరమేశ్వర విహార స్థానాలు. నా వద్ద కాశీక్షేత్ర చిత్రపటం ఉన్నది. ఇదిగో! ఇటుచూడు. అదే గంగానది. అదే మణికర్ణిక, బ్రహ్మ కపాలం భూమిమీద పడ్డ చోటు. ఇదిగో! ఈయనే కాలభైరవుడు. ప్రణవ మంత్రరూపమైన పంచతీర్థం అదిగో! ఆయన కుమారస్వామి. అడుగో విఘ్నేశ్వరుడు. ఈయన శనైశ్వరుడు. ఈవిడ మంగళ కాత్యాయని.

నాయనా! నీవు వెంటనే బయలుదేరి వారణాసి వెళ్ళి గంగానదిలో స్నానం చేయి. గంగానదిలో స్నానం చేసినవారికి అన్ని పాపాలు తొలగిపోతాయి. అపకీర్తి తొలగిపోతుంది. ఇష్టసిద్ధి కలుగుతుంది. జ్ఞానవాటికా తీర్థం నీకు తపస్సు చేయటానికి అనుకూలమైన ప్రదేశం. అక్కడ ఆదిత్యుడిని ఆరాధించు. నీకు శుభం కలుగుతుంది" అని వివరించాడు అక్రూరుడు.

"ధన్యుణ్ణి స్వామీ! మనోనేత్రంతో కాశీదర్శనం చేయించారు. మీ ఉపదేశం శిరసావహిస్తాను" అని ఆయనకు మొక్కి కొండంత ఆత్మవిశ్వాసంతో కాశీక్షేత్రానికి బయలుదేరాడు సాంబుడు.

ఆంధ్రప్రదేశ్ - తెలంగాణలలో

# దర్శనీయ దేవాలయాలు - చారిత్రక ప్రదేశాలు



## గుమ్మిలేరు

(తూర్పు గోదావరి జిల్లా - ఆంధ్రప్రదేశ్)

శ్రీ రోహిణి మహేష్, M.A., L.L.B., కన్నావారి తోట 2వ లైను, 27-9-54, గుంటూరు - 522 004

గుమ్మిలేరు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లాలో ఆలమూరు మండలంలో వుంది. ఇక్కడ జైనులకు చెందిన చింతామణి పార్శ్వనాధుని ఆలయం ఉంది.

క్రీ.శ. 1960లో ఇక్కడున్న వరహాల కాల్వపై వంతెన పునర్నిర్మాణానికి పునాదులు తవ్వుతుండగా ఓ విగ్రహం బయటపడింది. దీనిని బుద్ధునిగా భావించి కాల్వగట్టు ప్రక్కనే కొన్నేళ్ళవరకు ఉంచారు. ఆ తరువాత రాజమండ్రి ప్రాంతముల ద్వారా ఈ విషయం ఒక జైన మునికి తెలియడంతో ఆయన పరిశోధన చేసి విగ్రహానికి ఇరు ప్రక్కలా రాజసింహముద్రలు చెక్కి ఉండటంతో ఈ విగ్రహం అశోకుడి సమయకాలంనాటి పార్శ్వనాధునిగా నిర్ధారించారు. గ్రామవాస్తు దిశనుబట్టి పార్శ్వనాధుడికి చింతామణి పేరుపెట్టినట్లుగా చెబుతారు.

క్రీ.శ. 1962లో జైనముని నందన్ విజయన్ జీ మహారాజ్ ఈ విగ్రహాన్ని గుమ్మిలేరు ఆలయంలో ప్రతిష్టించారు. నాటినుంచి జైన సంప్రదాయ పద్ధతిలో నిత్య ధూపదీపనైవేద్యాలు జరుగుతున్నాయి.

ఇక్కడ రాజస్థాన్ వాస్తు సంప్రదాయం ప్రకారం ఇనుము, కంకర ఉపయోగించకుండా కేవలం సిమెంటు, పాలరాతితో కోటి రూపాయలతో పాలరాతి దేవాలయాన్ని నిర్మించారు. రాజస్థాన్ శిల్పకారుల హస్త నైపుణ్యంతో ప్రాచీన శిల్పకళ మళ్ళీ వెలుగు చూసేలా ఈ ఆలయాన్ని తీర్చిదిద్దారు. ఈ ఆలయాన్ని గుజరాత్ నుంచి వచ్చిన జైన పీఠాధిపతి జైన ఆచార్య రాష్ట్రసంత్ జయంతీ సేన్ సురీశ్వర్‌జీ ప్రారంభించారు.

కార్తీక పౌర్ణమి, చైత్రపౌర్ణమిలలో పెద్ద మేళా, పుష్యశుద్ధ దశమి, ప్రతి పౌర్ణమికి చిన్న మేళా వైభవంగా జరుగుతాయి. కార్తీక పౌర్ణమి పార్శ్వనాధుని పుట్టిన రోజు. పార్శ్వనాధుడు శ్వేతాంబర జైనుడు కావటంవలన పుట్టిన రోజు మేళాలో స్వర్ణాభరణాల అలంకారణ నయనానందాన్ని కలుగజేస్తుంది.



## పాఠకులకు మనవి

ప్రియ పరిపూర్ణాత్మ బంధువులైన **కాలజ్ఞానసుధ** పాఠకులకు విజ్ఞప్తి. ముద్రణ మరియు పేపరు ధర పెరిగినందువలన **2015 అక్టోబరు** నెల నుండి **సంవత్సర చందా : రు. 100/-** లుగా పెంచడమైనది. కనుక పాఠకులు గమనించ గలరు.

**గమనిక :** పాఠకులకు నెల మొదటి వారములో పత్రిక చేరని యెడల ఫోన్ చేసి తెలుపగలరు.

**సెల్ : 99491 32469**

# శ్రీరామ భక్తి



## 9. వేదవ్యాసుని శ్రీరామభక్తి

- కీ.శే డాక్టర్ రోహిణివెంకటసుందరవరదరాజేశ్వరి

నమో...స్తుతే వ్యాసవిశాల బుద్ధే
పుల్లార విన్దాయత పత్ర నేత్ర।
యేన త్వయా భారత తైల పూర్ణః
పజ్వాలితో జ్ఞాన మయః ప్రదీపః॥

వ్యాసం వసిష్ఠ నప్తారం శక్తేః పౌత్రమ కల్మషమ్।
పరాశ రాత్మజం వన్దే శుక తాతం తపో నిధిమ్॥

అజ్ఞానాంధకార సముద్ర మందు నిమగ్నులై యుండు ప్రాణులకు ఉపదేశించుటకు గాను సాక్షాత్తుగా నారాయణుడే జగద్గురువగు వ్యాసుని రూపమున వతరించి ప్రసిద్ధుడై యున్నాడు. వ్యాస మహర్షి ఎల్లకాలము అమరుడు.

ఆదిగురువు శంకరాచార్యునకు బదరీ క్షేత్రమందు దర్శన మిచ్చి అతనితో కలసి ఇరువది ఏడు దినములు శాస్త్రార్థములు చేసి అంతమున ప్రసన్నుడై తానెవరో తెలిపి వాని ఆయువును ద్విగుణీకృతము చేసెను. ఈ విధముగ నిజమైన భక్తులకు ఇప్పడును దర్శనమగుచున్నది. దీని వెంట ఎల్లప్పుడు భక్త, సంత, ఋషి, మునుల సమూహము స్థిరము నుండెడిది. ఇతడు వసిష్ఠ భగవానుని ప్రపౌత్రుడు. శక్తి ఋషికి పౌత్రుడు. పరాశరునకు పుత్రుడు, శుకదేవునకు తండ్రి గురువు శంకరాచార్య, గోవిందాచార్య, గౌడ పాదాచార్యులకు పరమగురువు. జనకాది రాజర్షులకును ఇతడు గురువు. యమునా ద్వీపమున ఆవిర్భవించిన వెంటనే యువకుడయ్యెనని పురాణ ప్రసిద్ధము. సమస్త వేదములను పఠించెను ఇతడు సామాన్య వ్యక్తిగాదు.

కృష్ణ ద్వైపాయనం వ్యాసం విద్ధి నారాయణం ప్రభుమ్।
కోహ్యన్యోభువి మైత్రేయ మహాభారత కృద్భవేత్॥ (విష్ణు పురాణము)

అష్టాదశ పురాణకర్త, మహాభారత రచయిత, బ్రహ్మసూత్ర నిర్మాత, వేదములను శాఖోపశాఖలుగ విభజించిన వేదవ్యాసుడు నారాయణునితో సమానుడు.

''యున్న భారతే తన్న భారతే'' అను సూక్తి ననుసరించి నేటి విశ్వజ్ఞానము, విజ్ఞానము వ్యాస భగవానునిదే. అందువలన "వ్యాసోచ్ఛిష్టం జగత్సర్వమ్" అనునది సుప్రసిద్ధ సత్యము.

వ్యాస భగవానుని సత్సంగములు నిరంతరము నడచుచుండెడివి. సత్సంగమందు బ్రహ్మతత్త్వ నిరూపణము, పరమాత్మ యొక్క నిర్గుణ, సగుణ స్వరూప విచారణ, ధర్మకర్మల వ్యాపకత, వాని ఫలాఫల మీమాంస, యోగ సాంఖ్యా ధ్యాత్మ జ్ఞానములు. భక్త్యంగములు అనువానిపై చర్చ జరిగెడిది. ఇతడు స్వయముగా వీనిని ఆచరించుట యందు, పాలించుట యందు నిరంతరము నిమగ్నుడై యుండెడివాడు.

వ్యాసులవారు శివ, విష్ణు, సూర్య, గణేశ, దేవీ, ఆదినామములతో విభిన్న పురాణములను నిర్మించి, వానియందు దేవతల భక్తి ప్రవాహమును పారించిన విధము నేటికిని భక్తులకు పరమ సాధనమై యున్నది. విష్ణుభగవానుని మత్స్య, కూర్మ, వరాహ, నృసింహ, వామనాది నామములపై కూడ ఈయన పురాణములను రచించెను.

రామభక్తిపై వ్యాస భగవానుడు రెండు గ్రంధములను వ్రాసెను. అవి పద్మ పురాణము, అధ్యాత్మరామాయణము.

పద్మపురాణము నందు శ్రీరామ భగవానుని చరిత్ర విస్తారముగ నిరూపించబడినది. పద్మపురాణ రామాశ్వమేధ ఖండమున అధికముగ నున్నది. ఇందులో తప్ప శ్రీరాముని ఉత్తర చరిత్ర పూర్తిగ లభించుటలేదు. అధ్యాత్మ రామాయణమందు యోగజ్ఞాన వైరాగ్యములు, భక్తి యొక్క మధురత ప్రవహించుచుండును. రామభక్తి గ్రంధములన్నింటి యందును ఉన్న రామ స్తోత్రములు దీని యందు సంగ్రహించబడియున్నవి. విభిన్న రామగీతలు అధ్యాత్మరామాయణము నుండియే సంగ్రహించబడినవి. వీనిలో హనుమ, లక్ష్మణ, శబరులు చేసిన మూడు కేవలము భక్తి పరమైనవి. గోస్వామి తులసీదాసుకూడ వీనినే సంగ్రహించి వ్రాసెను.

అధ్యాత్మ రామాయణ మందు ఈ విధముగ నున్నది.

**తస్మాద్భామిని సంక్షేపాద్వక్ష్యేఒ హంభక్తి సాధనమ్।**
**సతాం సంగతి రేవాత్ర సాధనం ప్రథమం స్మృతమ్॥**
**ద్వితీయం మత్కథాలాప స్తృతీయం మద్ గుణేరణమ్।**
**వ్యాఖ్యాతృత్వం మద్వచసా చతుర్థం సాధనం భవేత్॥**
**ఆచార్యోపాసనం భద్రే మద్బుద్ధ్యా మాయయా సదా।**
**పంచమం పుణ్య శీలత్వం యమాది నియమాది చ।**
**నిష్కామ త్వూజనం నిత్యం షష్ఠం సాధన మీరితమ్।**
**మమమంత్రో పాస కత్వం సాంగం సప్తమ ముచ్యతే॥**
**మద్భక్తేష్వధికాపూజా సర్వభూతేషు మన్మతిః।**
**బాహ్యార్థేషు విరాగిత్వం శమాది సహితం తథా॥**
**అష్టమా నవమంతత్త్వ విచారో మనుభామిని।**
**ఏవం నవవిధా భక్తిః సాధనం యస్యకస్యవా॥**
**స్త్రియోవా పురుష స్యాపి తిర్య గ్యోనిగ తస్యవా।**
**భక్తిః సంజాయతే ప్రేమ లక్షణా శుభలక్షణే॥**

( అధ్యాత్మ రామాయణము)

"భామినీ! నేను సంక్షేపముగ భక్తి సాధనములను చెప్పెదను. వీనిలో మొదటి సాధనము సత్సంగము. రెండవ సాధనము నా జన్మ కర్మల కథలను కీర్తించుట. మూడవ సాధనము నా గుణములను చర్చించుట. నాలుగవ సాధనము (గీతా, ఉపని షాదులతో) నా వాక్యములకు వ్యాఖ్యానము చేయుట. ఐదవ సాధనము నిష్కపటులై తమ గురుదేవుని భగవంతునిగా భావించి సేవించుట. ఆరవ సాధనము పవిత్ర స్వభావము, యమ నియమాదులు పాలించుట, ప్రేమతో సదా నన్ను దర్శించుట. బాహ్య పదార్థముల యందు వైరాగ్యము, శమ, దమాది సంపన్నులగుట, తొమ్మిదవ సాధనము తత్త్వ విచారణ. భామినీ! ఈ విధముగ ఇది నవవిధ భక్తి. ఈ సాధనములు స్త్రీకిగాని, పురుషునికిగాని, పశు పక్ష్యాదులకుగాని ప్రేమ లక్షణములుగల భక్తిని గలుగజేయును".

వ్యాసులవారు అగ్ని పురాణమందు రామునితో లక్ష్మణునకు సమస్త రాజనీతులను బోధింపజేసెను. స్కంద పురాణమందు బ్రహ్మఖండమున సేతు మహాత్మ్యము, రామ స్తోత్రములతోను, చరిత్రతోను పరిపూర్ణమైయున్నది. దీనిని చూచిన అన్నిటికంటె పెద్దది రామభక్తి మహిమ బోధించు గ్రంథమిదేనేమో అనిపించును. దీనియందు మారుతిరాముని స్తుతించుట అమోఘముగ నుండును. ఈ మహాత్మ్యము 60 శ్లోకములలో నిరూపింపబడినది. ఇది వ్యాసుల వారికి రామునిపైగల ప్రేమకు భక్తికి నిదర్శనము.

శ్రీమద్భాగవతము కృష్ణభక్తి గ్రంథము అయినను

దీని యందు కూడ సీతాపతి శ్రీరాముడు "సీతాపతిర్జయతి లోకమలంఘ్య కీర్తిః" అందరికంటె గొప్ప వాడనియు, వాని కీర్తిని ఎవరు ఉల్లంఘించలేరనియు వ్యాసులవారు శ్రీరాముని మహిమను అద్భుతముగ నిరూపించిరి. అన్ని దేవాలయముల యందును "వశే మహాపురుషతే చరణార విన్దమ్" అను శ్లోకములతో పూజాహారతులు గావింపబడుచున్నవి.

ధ్యేయం సదా పరిభవ ఘ్నమ బీష్ట దోహం
తీర్థాస్పదం శివ విరించినుతం శరణ్యమ్।
భృత్యార్తిహం ప్రణతపాల భవాబ్ధి పోతం
వన్దే మహాపురుషతే చరణార విన్దమ్॥
త్యక్త్వా సుదు స్త్యజ సురేప్సిత రాజ్యలక్ష్మీం
ధర్మిష్ఠ ఆర్యవచసా యదగాదరణ్యమ్।
మాయామృగం దయిత యేప్సిత మన్వధావద్
వన్దే మహాపురుషత్ చరణార విన్దమ్॥

ప్రభూ! మీరు శరణాగత రక్షకులు. మీ చరణార విందములు సదా ధ్యానము చేయుటకు యోగ్యమైనవి. మాయామోహ సాంసారిక పరాజయములను అంతము చేయువాడవు. భక్తుల కోరికలు అన్నియు దీర్చు కామధేను స్వరూపుడవు. తీర్థములకు కూడ తీర్థమైన పరమ తీర్థ స్వరూపుడవు. బ్రహ్మాది మహేశ్వర దేవతలచే నమస్కృతుడవు. శరణు అనికోరి వచ్చు వారిని స్వీకరించు వాడవు. సేవకుల సమస్త ఆపదలను నశింపజేయువాడవు. సంసార సాగరమును దాటుటకు ఓడవంటివాడవు. మహాపురుషా! మీ చరణార విందములకు వందనము చేయుచున్నాను. భగవాన్! మీ చరణకమలముల మహిమను ఎవరు చెప్పగలరు? రామావతార మందు మీ తండ్రి దశరథుని ఆజ్ఞతో దేవతల కొరకు రాజ్యలక్ష్మిని వదలి మీ చరణ కమలములు వనములందు తిరిగినవి. నిజముగా మీరు ధర్మనిష్ఠాపరులు. మహాపురుషా! మీ ప్రేయసి సీత కోరిక తీర్చుటకు మీ చరణ కమలములు మాయా మృగము వెనుక పరుగిడినవి. నిజముగ మీరు ప్రేమ బద్ధులే. ప్రభూ! ఇట్టి మీ చరణారవిందములకు వందనము చేయుచున్నాను". దీనివలన వ్యాసుల వారికి శ్రీరామునిపైగల శ్రద్ధానిష్ఠలు, భక్తి ప్రేమలు వెల్లడియగుచున్నవి.

రామచరిత్ర ఉప సంహార మందు ఈ విధముగ చెప్పెను.

**సయైఃస్పృష్టోఽభిదృష్టోవాసంవిష్టోఽనుగతోఽపివా।**
**కోసలాస్తే యయుఃస్థానం యత్ర గచ్ఛంతి యోగినః।**
**పురుషో రామ చరితం శ్రవణై రుపధారయన్।**
**ఆనృశం స్యపరోరాజన్ కర్మబన్ధైర్విముచ్యతే॥**

(శ్రీమద్భాగవతము)

రాముని స్పర్శపొందినవారు, రాముని దర్శించినవారు, రాముని దృష్టి పడినవారు, రాముని అనుసరించుచు మాట్లాడువారు, ఉత్తర కోసల నివాసులందరు సాంతానిక లోకములకు భగవానుని వెంటవెళ్ళిరి. శ్రీరాముని భక్తులు సమస్త కర్మబంధనముల నుండి ముక్తులగుదురు.

వ్యాసులవారు సమస్తావతారములను విభిన్న రుచులుగల భక్తుల కొరకు వ్రాసిరి. కాని నామరూపలీలాది లక్ష్యముతో చూచిన సిద్ధి పురుష ముఖ్యలక్ష్యము వ్యవసాయాత్మికా బుద్ధిరేకే హకురునందన (గీత) అనువచనానుసారము ఒకే వ్యక్తిగాని రూపముగాని అగును. భగవానుని అవతారుడైన శ్రీవ్యాసుల వారికి అతని ఆరాధ్యదైవమైన శ్రీరామభగవానునకు శతకోటి నమస్సులు □

# వివిధ వ్యాధులు - ఆయుర్వేద చికిత్సలు

డా॥ టి. చంద్రశేఖరం, తిరుపతి. 9701181966

(గత సంచిక తరువాయి)

**ఆవు నెయ్యి - సంపూర్ణ ఆరోగ్యానికి పునాది**

11. మన పూర్వీకులు, మన మాతృమూర్తులు చంటి బిడ్డలకు "ముక్కటామృతం" పెట్టేవారు. అంటే ఆవు నెయ్యి, ఆముదము, నువ్వుల నూనె ఈమూడింటిని ఒక్కొక్క బొట్టు కలిపి చనుబాలలో కలిపి రంగరించి తినిపించేవారు. క్రమంగా బిడ్డల వయస్సును బట్టి పెంచుకొంటూ పోయేవారు. ఈ ముక్కటామృతం సేవించే పిల్లలు మూడు నెలల నుండే బాగా ఏపుగా, బలముగా కాంతివంతముగా ఎదిగేవారు. పిల్లలు ఆరోగ్యవంతమైన భావిభారత జాతి నిర్మాతలను తీర్చిదిద్దాల్సిన బాధ్యతను చేపట్టవలసిన అవసరం ఎంతైనా వున్నది.

12. ఆవు నెయ్యిలోని మరో గొప్ప విశేషమేమిటంటే దాన్ని లోపలికి తీసుకోగానే అతి వేగంగా శరీరంలోని అణువణువులలోకి చొచ్చుకుపోతుంది. శరీరానికి శక్తిని, మృదుత్వాన్ని అందిస్తుంది. ఇన్ని గొప్ప గుణాలున్న ఆవునెయ్యిని వదలిపెట్టడం, ఆవులను పెంచకపోవడం, ఆవులను కబేళాలకు అమ్మడం భారతీయుల దురదృష్టం. దీనిని అరికట్టకపోతే జాతికి, యావత్ ప్రపంచానికి చాల ప్రమాదకరం. ఈ నగ్నసత్యం తెలుసుకొని నివారణ చర్యలు తీసుకోవడం మన తక్షణ కర్తవ్యం.

13. ఆవునెయ్యిని అగ్నిపై వేస్తే వచ్చే పొగ వాతావరణాన్ని కాలుష్య రహితముగా చేస్తుంది. అందుకే యజ్ఞయాగాదులలో నెయ్యి ఉపయోగించి రేడియో ధార్మిక కిరణాల నుండి రక్షణ లభిస్తుందని నేడు మన శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. దీనిని మన మహర్షులు ఏనాడో లోకకళ్యాణము కోసం ఆవునెయ్యి, ఆవు పిడకలతో యజ్ఞం నిర్వహించేవారు.

14. ఒక తులం నెయ్యితో యజ్ఞం నిర్వహిస్తే ఒక టన్ను ఆక్సిజన్ ఉత్పత్తి అవుతుందని ఇది వాతావరణ కాలుష్య నివారణకు ఎంతో దోహదపడుతుందని నేడు మన పరిశోధకులు తెలుసుకొన్నారు.

15. ఆవునెయ్యి, బియ్యం రెండూ కలిపి యజ్ఞం చేస్తే శక్తివంతమైన ఇథిలిన్ ఆక్సైడ్, ప్రొపలిన్ ఆక్సైడ్ మొదలైనవి ఉత్పన్నవౌతాయి. ఈ ఆక్సైడ్ జీవరక్షణకు, పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడుతాయి. కృత్రిమ వర్షాలు కురిపించడం కోసం ఈ ప్రొపలిన్ ఆక్సైడ్ ఆధారమని మన శాస్త్రవేత్తలు నేడు కనుగొన్నారు. మన మహర్షులు, పెద్దలు, వేదాలు యజ్ఞాల ద్వారా వర్షాలు, వర్షాల ద్వారా పంటలు సమృద్ధిగా లభిస్తాయని ఎప్పుడో తెలిపియున్నారు.

16. ఆవునెయ్యిని రోజూ క్రమం తప్పకుండా వాడడం వలన మానవునిలోని తమో, రజో గుణాలను అదుపులో వుంచి సత్వ గుణాన్ని పెంపొందించి, మంచి జ్ఞాపకశక్తి కలిగి ఏ వ్యాధి రానివ్వకుండా అకాలవార్ధక్యం రాకుండా వార్ధక్యంలో కూడ శక్తి సన్నగిల్లకుండా కాపాడుతుంది.

# గోవిందమాల వ్రత విధానం

... వై.వి. చలమయ్య, అర్కటవేముల

శ్రీ వెంకటాద్రి సంస్థానం బ్రహ్మాండే నాసికించన వెంకటేశ నమోదేవో నభూతోన భవిష్యతి

శ్రీ మహావిష్ణువు కృతయుగమున నరసింహ్మస్వామిగాను, త్రేతాయుగమున శ్రీరామచంద్రుడుగాను, ద్వాపరయుగమున శ్రీకృష్ణ భగవానుడుగాను, కలియుగమున శ్రీ వేంకటేశ్వరుడిగాను అవతారమెత్తి ప్రజలను ఉద్ధరించుచున్నారు. శ్రీ కృష్ణ భగవానుడు తన అవతారము చాలించగానే కలియుగము ప్రారంభం అయి ప్రజలు అల్పాయుష్కులు, అల్పబుద్ధులు అంతః కలహములతో దైవం పై విశ్వాసం నశించి ఐహిక సుఖమునే జీవిత పరమావధిగా భావించి తగవులు, తఖరార్లు నిష్కారణముగా పెట్టుకునుచు దుఃఖార్తులుగా జీవించుటను చూచి వేదవేత్తలైన మహర్షులు విశ్వశాంతి కొరకు నైరుశారణ్య గంగానది తీరమున ఒక మహాయజ్ఞం చేయ సంకల్పించుకొని యజ్ఞ ఫలాన్ని స్వీకరించుటకు ఎవరు అర్హులు అని చర్చించుకుంటూ వుండగా భృగు మహర్షి, బ్రహ్మ, విష్ణు, శంకరులలో అర్హులు ఎవరో నేను పరీక్షించి తెలునుకొని రాగలను అనగా అచ్చట చేరిన ఋషులందరు శ్రీభృగు మహర్షి తపశ్శక్తిచే తన కుడికాలులో జ్ఞాన నేత్రము కలవాడు. కనుక ఆయనను పంపుదామని అందరు నిశ్చయించుకొని భృగుమహర్షిని పంపిరి. ఆయన సరాసరి బ్రహ్మలోకమునకు పోయి బ్రహ్మదేవుని సమీపంలో గల ఆసనముపై కూర్చుండుట గమనించిన బ్రహ్మ తనకు అభివాదం చేయకనే నా సమీపమున కూర్చున్నాడని భృగువును పలకరించలేదు. బ్రహ్మ తనను పలకరించలేదని కోపగించుకొని ఓ బ్రహ్మ నీకు భూలోకంలో గుడికానీ, పూజపురష్కారములుగానీ జరుగవు అని శాపము ఇచ్చి అక్కడి నుండి కైలాసమునకు పోగా పరమేశ్వరుడు పార్వతిదేవితో మాట్లాడుకొనుచు ఈ ఋషి వచ్చుట గమనించలేదు. భృగు మహర్షికి ఆగ్రహం కలిగి పరమేశ్వర నీకు భూలోకములో లింగరూపమున మాత్రమే పూజలు జరుగును. కానీ నీ నిజరూపముతో జరుగకుండ పోవుగాక అని శాపమిచ్చి, అక్కడి నుండి విష్ణులోకమునకు పోయేను. అక్కడ శ్రీ మహావిష్ణువు పాన్పుపై శయనించి శ్రీ మహాలక్ష్మితో సరస సల్లాపములతో మునిగియుండెను. ఈ కోపిష్టి తాను వచ్చినది గమనించలేదని మీ త్రిమూర్తులకు ఇంతటి గర్వమా ? ఎవరు వచ్చారని ధ్యాస లేకుండ ఉన్నావని ఎదురురొమ్ములపై తన్నెను. శ్రీహరి, మహానుభావ తమరు విజయముచేయుట నేను చూడలేదు. క్షమించమని నమస్కరించి శ్రీభృగుపాదములను ఒత్తుతు ఆయన కాలిలోని జ్ఞాననేత్రము చెరిపినాడు. ఈ నేత్రము పోగానే భృగుకు గర్వమణిగి జ్ఞానోదయం అయి మహానుభావ తమ వంటి శాంతమూర్తులు 14 లోకములో దివిటి పెట్టి వెదికినను లేడు. నేను చేసిన తప్పిదమును నా యందు దయవుంచి మన్నించవలసినదిగా సాష్టాంగ ప్రణవములు అర్పించుచున్నాను. తమరు కలికాలంలో భూలోకమున అవతరించి ప్రజలను కాపాడవలసినదిగా ప్రార్థించుచున్నాను. మరియు మేము చేయు యాగఫలమును స్వీకరించవలయుననను తమ ఉదార

హృదయంశాంతమునకు నమస్కృతులు అర్పించుచున్నాను అని విష్ణువు వద్ద శెలవు తీసుకొని భూలోకమునకు వచ్చి, తన సహా ఋషువులతో త్రిమూర్తులలో శ్రీమహా విష్ణువు అంతటి యోద్యుడు ఎవరు లేరు. యజ్ఞమును చేసి శ్రీ విష్ణువు భగవానుడికి యజ్ఞ ఫలము దారపోయుదుమని చెప్పి యజ్ఞము పూర్తి చేసి శ్రీగోవిందునకు యజ్ఞఫలము ధారపోసిరి. శ్రీమహావిష్ణువు గురించి సరస్వతి నది, నదులలోకెల్లా తాను అధికురాలు కావలెనని తపం చేయుచుండగా ఆ సమయమున శ్రీ పులస్త్యమహర్షి తాను తపస్సు చేయుటకు సరస్వతి నది సమీపమునకు రాగా నది ఆదరించకపోయేను. అందులకు శ్రీ పులస్త్యవుల వారు కోపించి ఓ సరస్వతి నది నా అంతటి బ్రహ్మర్షిని నీవు నిరాధరించుతావా ? నీవు ఏ ఆశతో తపస్సు చేయుచున్నావో ఆశ నెరవేరదు. గంగానది లోకపావనిగా ప్రసిద్ధి గాంచినది. మరియు గంగానది శ్రీ మహావిష్ణు పాదము నుండి ఉద్భవించినది. కాన నీవు అంత దానవు కాలేవు. కాబట్టి నీ తపస్సు ఫలించదు. అని శపించెను. ఆ శాపమునకు సరస్వతి నది ఆగ్రహించి తనను నిష్కారణముగా శపించిన శ్రీ పులస్త్య ఋషిని చూసి నీ పులస్త్య వంశము రాక్షస వంశముగా మారిపోవునని ప్రతిశాపము ఇచ్చేను. అందుకు పులస్త్యవుడు అనేక విధములా దుఃఖించి బాధపడి నదిని ప్రాధేయపడగా కొంత శాంతించి నేనిచ్చిన శాపము జరిగి తీరవలసినదే. కానీ పశ్చాతాపము చెంది బాధపడుచున్నావు. కొంత సడలించెదను. మీ పులస్త్య వంశములో కడపటి వాడు విభేషనుడను నామధేయుడు జన్మించి పాపభీతి గల విష్ణుభక్తుడు మీ వంశమును తరింపచేయును అని అనుగ్రహించి మరలా సరస్వతి నది శ్రీహరిని గూర్చి తీవ్ర తపస్సు చేయుచుండగా విష్ణు భగవానుడు ప్రత్యక్షమై నీ కోరిక ఏమి అనగా సరస్వతి నది తాను చేసిన తపస్సు పులస్త్య ముని శాపముగా నిష్కఫలము అయినది. తన కోరిక నెరవెర్చమని భగవానున్ని వేడుకొనగా సరస్వతి నది భయపడవద్దు. పులస్త్యవుని శాపము నదులలో నీ గొప్పతనమునకు అడ్డుపడును. పుష్కరులలో నీ గొప్పతనమునకు అడ్డుకాదు. కాన భూలోకములోని శేషపర్వతమునకు పోయి శేషగిరి దక్షిణ ఉత్తర భాగమున స్వామి పుష్కరిణి అను నామధ్యేయముతో వుండుము. నేను శ్రీమహాలక్ష్మితో త్వరలో ఆ పర్వతమునకు రావలెనని అనుకొనుచున్నాను. కాన నేను అచ్చటికి వచ్చి నీ పుష్కరి కుడి ప్రక్కన దక్షిణ దిశన నీ సమీపముననే ఆనంద నిలయము అనుసౌధమున మహాలక్ష్మితో అక్కడ వుండగలను. అప్పుడు భూమండలంలోని అన్ని తర్ధీరాజములు మూడున్నర కోట్లు తీర్ధములు నా వద్దకు తమ పాపములు పోగొట్టుటకు రాగలవు. అట్టి సందర్భమున నీ పుష్కరిణిలో స్నానం ఆచరించిన మీ పాపములు పరిహారమవునని ఆదేశించగలను. ధనుర్మాస శుద్ధ ద్వాదశి రోజున సదరు తీర్థములు నీకు దానత్వమంది నిన్ను గొప్పదానిగా అభిషేకించగలవు అని స్వామి పుష్కరిణిగా వుండునట్లు చేసి శేషపర్వతమునకు భూలోకమునకు పంపినారు. అటు తరువాత వైకుంఠంలో శ్రీ మహాలక్ష్మి తన భర్తను ఎవరో ఒక ఋషి వచ్చి తన స్థానమైన యదపైన తన్నినను భగవానుడు ఆగ్రహించక ఆ ఋషికి నమస్కరించి మహానుభావ మిమ్ములను నేను చూడలేదు అని పాదసేవ చేయుచుండగా ఈ మహాలక్ష్మీ వైకుంఠంలో వుండకూడదని నిశ్చయించుకొని పాతాళలోకమునకు పోయి కపిలముని ఆదిద్యమున చాలాకాలము అచ్చట వుండెను. శ్రీ మహాలక్ష్మి లేకపోవుట తెలుసుకొని విష్ణువు అన్ని దేశములు తిరిగి భూలోకమునకు వచ్చి లక్ష్మి నివాసముగా ప్రసిద్ధి చెందిన కొల్హాపురము చేరి అచ్చట సమస్త పూజలు జరిపించుకొనుచున్న లక్ష్మిని చూచి తానును ఆయమ్మను అర్జించుచూ పది సంవత్సరముల కాలం అచ్చటే వుండగా అశరీరవాణి నీవు శ్రీ మహాలక్ష్మిదేవి

కొరకు పరితపించుచున్నావు. నీవు ఇక్కడి నుండి నేరుగా క్రిష్ణవేణి నదికి దక్షిణ దిశన ఇరవై రెండు యోజనములలో సువర్ణముఖి నది వున్నది. సదరు నదికి ఉత్తర తీరమున నీ కుంచాయుధముతో తవ్వి ఒక సరోవరము నిర్మించి ఆ సరోవరము నందు వైకుంఠము నుంచే స్వర్ణ కమలముల కుందనములను తెప్పించి నాటి, అవి బాగా వికసించి పుష్పించుటకు సూర్యనారాయణుని విగ్రహమును ప్రతిష్ఠించి నీవు ప్రతి రోజు స్వర్ణ కమలంతో శ్రీ మహాలక్ష్మిని పూజించుచుండిన కొంతకాలమునకు లక్ష్మిదేవి నిన్ను అనుగ్రహించి స్వర్ణకమలములోని కుసుమ యందు పద్మావతి దేవి (లక్ష్మిదేవి) 16 సంవత్సరములు కన్యగా సాక్షాత్కరించి అనుగ్రహించి నిన్ను కలుసుకోగలదు అని అశీరవాణి చెప్పిన ప్రకారం శ్రీస్వామి ఆచరించి పద్మావతి దేవితో సరస్వతి నదికి యిచ్చిన మాట ప్రకారం భగవానుడు శేషశైలమునకు వచ్చి స్వామి పుష్కరిణి పశ్చిమతీరమున భాద్రపద శుక్ల ద్వాదశి సోమవారము శ్రవణ నక్షత్రము శుభసమయమున శ్రీనివాస భగవానుడు అవతరించి పుష్కరిణికి దక్షిణ భాగమున ఆనంద నిలయంలో శ్రీ మహావిష్ణువు శ్రీ వెంకటేశ్వరునిగా వుంటూ తన భర్తాదులకు యితి బాధలు తీర్చుతు కోరినంతమాత్రముననే అనుగ్రహించుచున్నటువంటి శ్రీ అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీగోవిందుల వారిని మనము ఒక దీక్షా విధానముగా గోవింద మాల అను వ్రతమును కులమత బేధములను పాటించక సర్వప్రజలు ధనుర్మాసమున వచ్చు ముక్కోటి ఏకాదశి నాటికి ముందుగా 61 లేక 41, ఆదమము 21 రోజులు వ్రత దీక్ష వహించి స్వామి కృపకు పాత్రకావలెయును. గోవింద దీక్ష వహించదలచినవారు, రెండు పసుపు రంగు పంచెలు, అదె రంగుమీది పంచెలు, స్పటిక మాల గానీ, తులసీ మాల గాని తెచ్చుకొని శుద్ధి చేయించుకొని మీ గ్రామములో వుండే దేవాలయములో వుండు అర్చక స్వాములవారితోకాని, గోవిందమాల గురుస్వాములతోగాని మాలను శుద్ధిచేసుకొని వారితో వేయించుకొని దీక్షచేయుచు ఉదయం, సాయంత్రం, 06, 07 గంటల మధ్య కాలంలో స్వామి వారి పటమునకు ఎదురుగా కూర్చొని స్వామివారి, అమ్మవారి అష్టోత్తర శతనామావళి, స్వామి వారి గోవిందనామాలను పటించి ముక్కోటి ఏకాదశి ముందురోజు స్వామివారి ముడుపు కానుకలు, పసుపురంగు సంచిలో ఒకవైపు, ఇంటికి తెచ్చుకునే ముడుపు మరియొక్క వైపు కట్టుకొని ఏకాదశి రోజు స్వామి వారిని దర్శించుకొనుటకు ముందుగా అలవేలు మంగాపురంలో వెలిసిన అమ్మలగన్న అమ్మ అలివేలు మంగమ్మను (పద్మావతి) ప్రధమమున దర్శించి ఆమె ఆశీర్వాదం పొంది కొండకు పోయిన తరువాత మునుముందు శ్రీ వరాహస్వామి వారిని దర్శించిన తరువాత శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించి మాలను ఆ దేవళంలోనే గురుస్వాములవారితో తీయించుకొని యింటికి వచ్చిన తరువాత వచ్చు శనివారము పాయిశము చేసి టెంకాయ కొట్టి కర్పూర హారతి ఇచ్చి మీకు కావలసిన మిత్రులు, బంధువులతో భుజించి దీక్షవిరమణ చేయవలెయును. ఈ విధముగా చేసిన స్వామి వారు మీ కార్యములను నిర్విఘ్నముగా నెరవేర్చి మిమ్ములను అనుగ్రహించును. ఈ మన్మధనామ సంవత్సరం ముక్కోటి ఏకాదశి 21-12-2015వ తేది సోమవారము అయినది. కాగా భక్తాదులు త్వరపడి దీక్షవహించి స్వామి వారి కృపకు పాత్రులు కాగలరు. స్త్రీలు శారీరక అనుకూల తను అనుసరించి 11 రోజులు గాని, 7 రోజులుగాని గోవింద మాల వ్రతం ఆచరించవచ్చును. మరియు వైకుంఠ ఏకాదశి మరుసటి రోజు స్వామి వారికి పుష్కరిణిలో చక్రస్నానము జరుగును. ఆ సమయమున ప్రతి ఒక్కరు తప్పని సరిగా చక్రస్నానం చేసిన సర్వపాపములు పరిహారం కాగలవు.

# వాస్తు- సైన్సు

.... ఆళ్ళ రామకృష్ణ., రాజేంద్రనగర్, గుంటూరు. 9492464366

## కర్మాగారాలకు వాస్తు

పరిణామ క్రమంలో మానవుడికి అవసరాలు పెరగడంతో, వస్తూత్పత్తి కోసం కర్మాగారాల మీద ఆధారపడవలసిన అవసరం ఏర్పడింది. కర్మాగారాలను నిర్మించేటప్పుడు, ఆ కర్మాగారం యజమాని ప్రభుత్వం నుండి ఎన్నో అనుమతులను పొందవలసివస్తుంది. అవన్నీ కూడా ప్రకృతిని కాలుష్య బారినపడకుండా చేయడానికే అంతేకాకుండా, ఒకసారి ఏదైనా కర్మాగారం స్థాపించినట్లయితే, అది సజావుగా సాగాలంటే, ఆ కర్మాగారానికి కావలసిన నీరు, ముడి పదార్థాలు, వాటితో పాటుగా వాటి నుపయోగించి తయారు చేయటానికి కార్మికులు కావాలి. అంటే, ప్రకృతి వనరులతో పాటుగా, జీవరాశిలో అత్యుత్తమ స్థానాన్ని పొందిన మానవ కృషి ఫలితంగా వస్తూత్పత్తి సృష్టింపబడుతుందన్న మాట. అటువంటి కర్మాగార నిర్మాణ సమయంలో వాస్తు ప్రకారం నిర్మాణము చేపట్టినట్లయితే, ఎటువంటి విఘ్నాలు, కష్టనష్టాలు, కర్మాగారంలో కార్మికులతో గొడవలు లేకుండా, అన్ని పనులు సజావుగా జరుగుతాయి. కర్మాగార నిర్మాణంలో వాస్తు గురించి తెలుసుకుందాం.

కర్మాగారాల నిర్మాణానికి నైఋతి బ్లాకు బాగా కలిసివస్తుంది. ఆ తరువాత ఆగ్నేయం బ్లాకు, వాయవ్యం బ్లాకు, ఆ తరువాత ఈశాన్యం బ్లాకు వరసలో వస్తాయి. దక్షిణం, ఆగ్నేయం మరియు పడమర వాయవ్యం గేటు ఫ్యాక్టరీలకు చాలా మంచిది.

కర్మాగారాలకు గేట్లు ఎన్ని ఎటువైపు వున్నప్పటికి, ఈశాన్యంలో గేటు తప్పని సరిగా ఏర్పాటు చేయాలి. ప్రధానమైన రోడ్డు ఎటువున్నదో, అటువైపు తప్పని సరిగా ప్రధాన ద్వారం ఏర్పాటు చేయాలి. అంతేకాకుండా, కర్మాగారానికి రోడ్డు ఎన్ని వైపుల ఉందో, అన్ని వైపులా ఉచ్ఛస్థానంలో ద్వారం ఉండవలసిందే. కర్మాగారానికి సంబంధించిన భవనాలు, షెడ్డులు తూర్పు పడమరగా ఉండటం మంచిది. అవి ఉత్తర దక్షిణాల షెడ్లు లేదా భవనాల కంటే మంచి ఫలితాన్నిస్తాయి.

కర్మాగారానికి సంబంధించిన యంత్ర పరికరాలకు, షెడ్లు నిర్మించే సమయంలో, వాలు ఇస్తున్నప్పుడు, ఆ వాలు దక్షిణం నుండి ఉత్తరానికి లేదా పడమర నుండి తూర్పునకు గాని వేయాలి. అలాకాకుండా, ఒక్కోసారి మధ్యలో ఎత్తుగా ఉండి, రెండువైపులా వాలు దించాల్సిన అవసరం ఏర్పడుతుంది. అటువంటి సమయాలలో, వాలు రెండు వైపులా సమంగా ఉండునట్లుగా దించుకోవాలి.

యంత్రాల కోనం వేసే షెడ్లను స్థలంలో పడమరగాని, దక్షిణంలోగానీ వేయాలి. అన్నింటికంటే ఎత్తైన షెడ్లను నైఋతితో మొదలుపెట్టి పడమర పొడవునా లేదా దక్షిణం పొడవునా వేయాలి. అదే విధంగా షెడ్డుకు షెడ్డుకు మధ్య దూరం చూసుకుంటే తూర్పు / ఉత్తరంకు వచ్చే కొలదీ షెడ్ల మధ్య దూరం పెరుగుతూ వుండాలి. అంటే ప్రతి షెడ్డుకు పడమర / దక్షిణం కంటే తూర్పు / ఉత్తరం వైపు ఎక్కువ ఖాళీ ఉండేటట్లు జాగ్రత్తపడాలి. అంటే షెడ్లు ఒకదానికొకటి సమాంతరంగా ఉండి, పోయే కొలదీ వాటిమధ్య

దూరం పెరుగుతూపోతుందన్న మాట.

కర్మాగారాలను నిర్మించే వారు, వారి స్వలాభం కోసం మొదలు పెట్టినప్పటికిని, తద్వారా ఎంతో మందికి జీవనోపాధి కల్పించడం ద్వారా సామాజిక బాధ్యతను తీసుకొన్న వారవుతారు. ఆ రకంగా వారు చాలా అభినందనీయులు. కాని, ప్రస్తుత పరిస్థితులలో, ఈ కర్మాగారంలో వస్తూత్పత్తి సమయములో ఏర్పడే కొన్ని ఘన / ద్రవ / వాయు పదార్థాలుగానీ, శబ్దాల వలన పర్యావరణ కాలుష్యం ఏర్పడి మానవ మనుగడకు ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పంచభూతాల కలయికతో ఏర్పడి, ఈ ప్రకృతిని 84 లక్షల జీవరాశులలో ఒక్క మానవుడు మాత్రమే కాలుష్యం చేస్తున్నాడు. ఈ కర్మాగారాల నుంచి వచ్చే పొగ ధూళితో కలుస్తుంది. ఈ ధూళి గాలితో కలిసి, మేఘాలలో ఉండే నీటి ఆవిరితో కలిసి, అదే వర్షరూపంలో భూమిని చేరి, చెరువులు, కొలనులు, నదులు, సముద్రాలు కలుషితమవుతాయి. వాటి నుపయోగించి మనుష్యులు అనారోగ్యం పాలవుతారు. ఆ గాలిని పీల్చి, మానవులు ఊపిరితిత్తుల సమస్యతో ఇబ్బంది పడతారు. ఈ సృష్టిలో ప్రతి పని రికార్డవుతుంది. కర్మాగారాన్ని కట్టడానికి వుపయోగించే డబ్బు, ఒక చెట్టు పేపరు నుండి తయార''వుతుంది. నాణాలు, భూమిలో లభించే లోహంతో తయారవుతాయి. ఆ కర్మాగారంలో పనిచేసే మానవులు కూడ ప్రకృతిలో సృష్టించబడిన అత్యుత్తమ స్థానానికి చెందిన ఒక జీవజాతి. వీటితో పాటుగా, ప్రకృతిలో లభించే పంచభూతాలనుపయోగించారు. ఆ కర్మాగారాన్ని నడపగలుగుతారు. కాని, పంచభూతాలు ప్రకృతిలో ఒక నియమం ప్రకారం వుంటాయి. ప్రకృతిలోని సంపదను ఒక కోణంలో ఉపయోగించడం ద్వారా ప్రకృతిలోని సమతుల్యత దెబ్బతింటుంది. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని ఏదైనా కర్మాగారం నిర్మించేటప్పుడుగాని, దానిని నడుపుకొనేటప్పుడుగాని, సామాజిక బాధ్యతను స్వీకరించడం ద్వారా, మనం ఏ ప్రకృతి ద్వారా, సమస్త విషయ సంపదను పొందుతున్నామో, ఆ ప్రకృతి రక్షింపబడటమే గాక మానవ మనుగడకు కూడా మంచి సోపానాన్ని నిర్మించిన వారవుతారు. ఫ్యాక్టరీ యజమానులు వారి దగ్గరవున్న వనరులను పయోగించి ఫ్యాక్టరీలు నిర్మించేటప్పుడు, వాస్తు ప్రకారం నిర్మించి, మంచి లాభాలు ఆర్జించటంతో పాటుగా, ప్రకృతి పరంగా కూడా సామాజిక బాధ్యతను స్వీకరిచడం ద్వారా, మన రాబోయే తరానికి ప్రకృతిని యధాతథంగా ఉంచటానికి సాధ్యమవుతుంది.


# శ్రీ గోవిందమాంబా మహాదేవి జయంతి

మన అచలానంద ఆశ్రమములో
**మార్గశిర శుద్ధ ఏకాదశి**
**తేది 21-12-2015**
**ముక్కోటి ఏకాదశి** రోజున
**శ్రీ గోవిందమాంబా మహాదేవి అమ్మవారి జయంతి**
సందర్భముగా
విశేషకార్యక్రమములు జరుగును.
కావున భక్తులందరూ విచ్చేసి
అమ్మవారి కృపకు పాత్రులు
కాగలరు.

**శ్రీ అచలానంద ఆశ్రమము**
మంగమూరు రోడ్డు, ఒంగోలు
ఫోన్స్: 08592/ 235341
9949132469









శ్రీ అచలానంద ఆశ్రమములో దసరా మహోత్సవములలో వివిధ కార్యక్రమములు